



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 259 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 10 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-






## పనితీరు ఆధారంగా
# శాఖలకు స్కోరింగ్

- వివిధ శాఖలకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నిర్దేశించిన సీఎం చంద్రబాబు నాయుడు
- పనితీరు ఆధారంగా స్కోరింగ్ విధానం అమలుకు నిర్ణయం
- పతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికల రూపకల్పన
- ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ ఫోర్స్ ఏర్పాటుపై ఆలోచన
- 2047 స్వర్ణాంధ్ర లక్ష్య సాధన కోసం డేటా ఆధారిత పాలనపై దృష్టి

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు, వృద్ధి రేటును పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యాచరణ ప్రారంభించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) లక్ష్యాలు, ప్రభుత్వ శాఖల పనితీరును కొలిచే కీ-పెర్ఫార్మెన్సు ఇండికేటర్ల (కేపీఐ)పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, రవాణా, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వివిధ శాఖలకు కేపీఐలను సీఎం నిర్దేశించారు. జాతీయ సగటు కంటే వెనుకబడిన సూచికలను మెరుగుపరచడమే కాకుండా, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. కేవలం నిర్దేశిత లక్ష్యాలే కాకుండా, వాస్తవ వృద్ధి (రియల్ గ్రోత్) ఆధారంగా శాఖల పనితీరును అంచనా వేసేందుకు స్కోరింగ్ విధానాన్ని అమలు



చేయాలని సీఎం నిర్ణయించారు. రాష్ట్ర, క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను ఎప్పటికప్పుడు విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలపై పెట్టే వ్యయం, ఆర్థిక కార్యకలాపాలను 3.5 రెట్లు పెంచేలా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఆర్థిక వ్యవహారాలను మిగతా .. 2లో..

## స్టీల్ ప్లాంట్ ఘటన..
# పరిహారం ప్రకటించిన పవన్

- కిమ్స్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ
- నిపుణుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు
- త్వరలో కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహిస్తానని వెల్లడి



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖకు చేరుకున్న ఆయన కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులను స్వయంగా అడిగి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం స్టీల్ ప్లాంట్‌లోని ప్రమాద స్థలాన్ని పరిశీలించి యాజమాన్యం, ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 10 లక్షల చొప్పున సాయం అందిస్తామని, వారి పూర్తి చికిత్స ఖర్చులను ఆర్.ఐ.ఎన్.ఎల్. భరిస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి స్టీల్ ప్లాంట్‌లో మిగతా .. 2లో..

## 21న అమరావతిలో జరిగే
# 'యోగాంధ్ర'కు బాబా రాందేవ్ హాజరు

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఈ నెల 21న జరిగే రాష్ట్ర స్థాయి యోగాంధ్ర-2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పతంజలి రాందేవ్ బాబాను ఆహ్వానించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మిగతా .. 2లో..

## గోదావరి ప్రక్షాళనకు
# కేంద్రం భారీ నిధులు

పవన్ కల్యాణ్ చర్యలపై సోము వీర్రాజు ప్రశంసలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి నదిని కాలుష్యం నుంచి కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందని ఏపీ బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. నది ప్రక్షాళన కోసం కేంద్రం ఏడాదికి రూ.400 కోట్ల చొప్పున నిధులు ప్రకటించిందని, అందులో ఇప్పటికే రూ.100 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. రాబోయే గోదావరి పుష్కరాల మిగతా .. 2లో..


## విశాఖ ఉక్కు ప్రమాద బాధితులకు
# అండగా ఉంటాం

- మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి నారా లోకేష్
- ప్రమాద కారణాలపై ముగ్గురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో నిన్న జరిగిన ప్రమాదంలో 8 మంది మృతి చెందగా, ఆరుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం విశాఖ కేజీహెచ్‌లో బాధిత కుటుంబాలను రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అనిత, సంధ్యారాణి, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీ శ్రీభరత్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, చింతకాయల విజయ్ తదితరులు పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న మంత్రి లోకేశ్.. ధైర్యంగా ఉండాలని వారికి మిగతా .. 2లో..

## ఏపీ పర్యాటకాభివృద్ధి కోసం
# కీలక ఒప్పందం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. ఏపీ టూరిజం, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఐఏటీవో) మధ్య పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ సమక్షంలో ఎంవోయూ కుదిరింది. సెప్టెంబర్ 10 నుంచి 12వరకు విశాఖలో 41వ ఐఏటీవో వార్షిక సదస్సు నిర్వహణ దృష్ట్యా ఈ ఎంవోయూ చేసుకోవడం విశేషం. సీఎం చంద్రబాబు విజన్‌కు తగినట్టు ఐఏటీవోతో ఏపీ ఒప్పందం చేసుకుందని ఏపీ పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ మిగతా .. 2లో..

## మూడేళ్లలో మౌలిక వసతుల కల్పనకు
# భారీ ప్రణాళికలు

- డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకు రూ.29 వేల కోట్ల ప్రణాళిక
- మున్సిపాటీల్లో చేసే పనుల్లో ప్రజా ధనం వృదా కాకూడదు
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. స్థానిక మురళీ ఫార్చ్యూన్ హోటల్ లో హడ్కో ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కెపాసిటీ బిల్డింగ్ రెండు రోజుల వర్క్ షాపులో భాగంగా తొలి రోజు వర్క్ షాపును పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మిగతా .. 2లో..

## రాజమహేంద్రవరంలో
# భారీ అగ్నిప్రమాదం

షాపింగ్ మాల్‌లో మంటలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. లాలా చెరువుకు సమీపంలోని ఫ్యాషన్ ఫ్యాక్టరీ షాపింగ్ మాల్ సెల్లార్‌లో భారీ మొత్తంలో నిల్వ ఉంచిన కాటన్‌కు మంటలు అంటుకున్నాయి. సెల్లార్ నుంచి దట్టమైన పొగలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న మిగతా .. 2లో..

# వైసీపీ విష ప్రచారాలను రైతులు నమ్మొద్దు

దుష్ప్రచారం చేస్తే జైలుకే: మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరిక



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తోతపూరి మామిడి రైతులను తప్పుదోవ పట్టిస్తూ వైసీపీ అనుబంధ సోషల్ మీడియా వర్గాలు, కొందరు రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు చేస్తున్న విష ప్రచారాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిడి కొనుగోళ్లు, పల్ప్ పరిశ్రమలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికల్లో అసత్యాలు ప్రచారం చేయడం దుర్మార్గమైన చర్య అని మిగతా .. 2లో..

# మహిళలతో పెట్టుకుంటే ఎవరైనా అధికారంలో ఉంటారా?

తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**సికింద్రాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేసిన సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మహిళాశక్తి సభలో సీఎం పాల్గొని ప్రసంగించారు. "ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుంది. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును గత ప్రభుత్వం మిగతా .. 2లో..

## అనంతబాబుకు జైల్లో వసతుల కల్పన పిటిషన్‌పై
# విచారణ వాయిదా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డ్రైవర్ వీధి సుబ్రమణ్యం హత్య కేసుపై రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, రిమాండ్ ఖైదీగా ఉన్న వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబును పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టారు. జైలులో తనకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరుతూ అతడు వేసిన పిటిషన్‌పై విచారణ మిగతా .. 2లో..

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు

కువైట్ పాలకులకు మోదీ ఫోన్



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ప్రధాని మోదీ కువైట్ పాలకులకు ఫోన్ చేశారు. కువైట్ యువరాజు (అమీర్) షేక్ మెషల్ అల్ అహ్మద్ అల్ జబీర్ అల్ సబాతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ దేశంపై ఇరాన్ చేసిన దాడులను ఖండించారు. అక్కడి భారతీయుల క్షేమ సమాచారం గురించి ఆరా తీశారు. ఆ ప్రాంతంలో శాంతి పునరుద్ధరణ కోసం దౌత్య పరిష్కారాలు కనుగొనాలని మోదీ పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారని.. కువైట్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండిస్తోందని ప్రధానమంత్రి కార్యాలయం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఇటీవల కువైట్, బహ్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై ఇరాన్ డ్రోన్ దాడులకు పాల్పడింది. కువైట్ మిగతా .. 2లో..


## హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో
# ఆరోపణలకు, విమర్శలకు ఆస్కారమివ్వొద్దు

- బీసీ బిడ్డల ఉన్నత విద్యే కూటమి లక్ష్యం
- బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖాధికారుల సమీక్షలో రాష్ట్ర మంత్రి సవిత



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో ఆరోపణలకు, విమర్శలకు తావివ్వకుండా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఆప్కో, లేపాక్షి షో రూమ్‌ల్లో అమ్మకాలు పెంచాలని, చేనేతలకు, హస్త కళాకారులకు రోజూ ఉపాధి కల్పించాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. స్థానిక పద్మావతి గెస్ట్ హౌస్ లో బీసీ సంక్షేమ, ఆప్కో, లేపాక్షి అధికారులతో మంత్రి సవిత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల వారీగా చేపడుతున్నఅభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖాధికారులతో మాట్లాడుతూ, కొద్ది రోజుల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుందన్నారు. విద్యార్థులు హాస్టళ్లలో చేరేలోగా, తరగతి గదులను, విశ్రాంతి గదులను, మరుగుదొడ్లను, బాత్ రూమ్‌లను మిగతా .. 2లో..

## తమిళనాడులో మహిళల రక్షణ కోసం
# 'సింగప్పెన్' టాస్క్ ఫోర్స్'



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు సీఎం విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మహిళల భద్రత కోసం రాష్ట్రంలో 'సింగప్పెన్ స్పెషల్ టాస్క్ ఫోర్స్' అనే ప్రత్యేక మహిళా పోలీస్ విభాగాన్ని ప్రారంభించారు. మహిళలు, పిల్లలపై నేరాలను ఆపేందుకు, ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే స్పందించేందుకు వీలుగా ఈ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విభాగానికి రూ. 354 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. సింగప్పెన్ దళం చిహ్నాన్ని ఆవిష్కరించి.. ఆ బృందాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గస్తీ వాహనాలను ప్రారంభించారు. ఓ వాహనాన్ని ఆయనే స్వయంగా నడిపారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ మహిళా భయంతో జీవించకూడదని.. సురక్షితంగా ఉన్నామనే భావనతో బయటకు రావాలని అన్నారు. స్త్రీలపై వేధింపులు కేవలం శాంతిభద్రతల సమస్య మాత్రమే కాదని.. మొత్తం సమాజానికి సంబంధించిన సమస్యని విజయ్ పేర్కొన్నారు. మహిళలపై మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## పనితీరు ఆధారంగా శాఖలకు స్కోరింగ్

రియల్ టైంలో పర్యవేక్షించేందుకు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలనే ఆలోచనను కూడా పంచుకున్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా ఆధారిత పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. అమరావతి, పోలవరం, పోర్టులు, ఎయిర్‌పోర్టుల వంటి కీలక ప్రాజెక్టులతో ఆర్థిక వ్యవస్థకు 'మల్టిప్లైయర్ ఎఫెక్ట్' తీసుకురావాలని సూచించారు. కేపీఐలు మెరుగ్గా ఉంటేనే రాష్ట్ర వృద్ధి రేటు పెరుగుతుందని, ప్రతి రంగంలోనూ గ్రాస్ వాల్యూ అడిషన్ (జీవీఏ) పెంపుపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి అన్నారు.

## పరిహారం ప్రకటించిన పవన్

ఉద్యోగం కల్పిస్తామన్నారు. పదవీ విరమణ ప్రయోజనాల కింద రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 1.72 కోట్లు, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ. 45.75 లక్షలు అందుతాయని వివరించారు. మృతుల పిల్లల చదువులకు కూడా యాజమాన్యం సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. గత 30 ఏళ్లలో ఇలాంటి ఘోర దుర్ఘటన జరగలేదని పవన్ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన ముందు రోజు రాత్రి కూడా ప్లాంట్‌లో ఇలాంటి చిన్న సాంకేతిక లోపం తలెత్తిందని, అయితే రాత్రి వేళ కార్మికులు ఎవరూ లేకపోవడం వల్ల ఎవరికీ తెలియలేదని తన దృష్టికి తెచ్చారని ఆయన వివరించారు. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు, యంత్రాల ఆధునికీకరణపై దర్యాప్తు చేయడానికి ఒక ప్రత్యేక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని, వారి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యలపై, వారి భద్రతపై త్వరలోనే ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి స్వయంగా కార్మికులతో మాట్లాడతానని పవన్ హామీ ఇచ్చారు. ఇలాంటి ఘోర ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం బాధపడి వదిలేయకుండా.. ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ కల్పించేందుకు యాజమాన్యం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## 'యోగాంధ్ర'కు బాబా రాందేవ్ హాజరు

వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే 25వేల మందిని గ్రూపులుగా విభజించి రాందేవ్ బృందానికి చెందిన వారితోపాటు వివిధ యోగా అసోసియేషన్ల ప్రతినిధులు ఆసనాలు వేయిస్తారని చెప్పారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు అనుసరించి యోగా అండ్ నేచురోపతి ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు, ఆయుష్ అధికారులు మర్యాదపూర్వకంగా 'హరిద్వార్' వెళ్లి బాబా రాందేవ్ ను నేరుగా ఆహ్వానించబోతున్నారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణ, జిల్లాల వారీగా పురోగతి, ఇతర అంశాలపై ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాందేవ్ శిక్షణ పొందుతున్న వారిలో కొందరు విద్యార్థులు ఈ నెల 21న రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. వీరు కూడా యోగాసనాలు చేస్తారని చెప్పారు. రాందేవ్ రాకతో యోగాకు మరింత ప్రాచుర్యం పెరుగుతుందని, యోగాంధ్ర ఖ్యాతిని పెంచుతుందని వెల్లడించారు.

## గోదావరి ప్రక్షాళనకు కేంద్రం భారీ నిధులు

నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతంలోని 290 గ్రామాలను అభివృద్ధి చేయాల్సి ఉందన్న ఆయన.. మునికూడలిలో ఘాట్ నిర్మాణం కూడా శరవేగంగా జరుగుతోందని తెలిపారు. ఇదే సమయంలో, గోదావరి నది కాలుష్యంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించిన తీరును సోము వీర్రాజు అభినందించారు. నదిని కాలుష్య కోరల నుంచి కాపాడేందుకు ఆంధ్ర పేపర్ మిల్లుతో పాటు రాజమండ్రి నగరపాలక సంస్థ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పవన్ ఆదేశించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గతంలో పేపర్ మిల్లు కాలుష్యంపై ఎవరు మాట్లాడినా బ్లాక్‌మెయిల్ చేస్తారనే వాదన ఉండేదని, కానీ ఒక డైనమిక్ లీడర్‌గా పవన్ కల్యాణ్ ఆ అడ్డంకులను అధిగమించి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలు అందిస్తున్న నరేంద్ర మోదీ పాలన స్ఫూర్తితోనే ఈ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని సోము వీర్రాజు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో ప్రధాని మోదీ పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## రాజమహేంద్రవరంలో భారీ అగ్నిప్రమాదం

అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కాటన్‌తో పాటు పలు వస్తువులు అగ్నికి ఆహుతై భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## విచారణ వాయిదా

నేడు జరగ్గా.. ఇరుపక్షాల వాదనలను న్యాయమూర్తి విన్నారు. అనంతబాబుపై గతంలో నేర చరిత్ర ఉందని ప్రత్యేక పీపీ ముప్పాళ్ల సుబ్బారావు కోర్టుకు తెలిపారు. ఆయనపై పలు కేసులో విచారణలో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. జైలు నిబంధనల ప్రకారం ఈ తరహా నిందితులకు ప్రత్యేక వసతులు ఇవ్వరాదని వాదించారు. దీంతో, కనీసం ఇంటి భోజనమైనా ఇప్పించాలని అనంతబాబు తరఫు న్యాయవాదులు కోరగా.. తదుపరి విచారణను కోర్టు ఈ నెల 18కు వాయిదా వేసింది. దీంతో ఈ అంశంపై 18న తీర్పు వెలువడే అవకాశం ఉంది. అదేరోజు ఈ హత్య కేసులో సాక్షుల వాంగ్మూలాలను ప్రత్యేక కోర్టు నమోదు చేయనుంది. అనంతబాబుకు సెక్యూరిటీగా ఉన్న సిబ్బంది సాక్ష్యం నమోదు చేయనున్నట్లు సమాచారం.

## అండగా ఉంటాం

భరోసా కల్పించారు. కేంద్ర మంత్రితో కలిసి బాధిత కుటుంబాలను ఓదార్చారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. బాధితులకు మద్దతుగా నిలబడేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు ఇక్కడికి వచ్చారని తెలిపారు. బాధిత కుటుంబాలకు జీవితాంతం అండగా ఉంటామని స్పష్టం చేసిన మంత్రి.. అందరం కలిసి పోరాడటం వల్లే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలిగామని గుర్తు చేశారు. ప్రమాద ఘటనపై నియమించిన కమిటీ నివేదిక వచ్చిన అనంతరం బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విశాఖ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు.

## కీలక ఒప్పందం

వెల్లడించారు. జాతీయ స్థాయిలో ఏపీ పర్యాటక రంగ ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుతో ఏపీకి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల వివరాలు ప్రపంచవ్యాప్తంగా తెలుస్తాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో రాష్ట్రానికి వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. ఈ సదస్సుకు వెయ్యి మంది టూరిజం డెలిగేట్స్ వస్తారని తెలిపారు.

## భారీ ప్రణాళికలు

ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో ప్రజల ప్రాథమిక అవసరాలైన ఐదు ప్రధాన అంశాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, వాడుక నీటి నిర్వహణ, అంతర్గత రోడ్ల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. హడ్కో దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అర్బన్ ఇన్వెస్ట్‌మెంట్ విండో' వర్క్ షాపు వల్ల పట్టణ ప్రాంతాల అభివృద్ధికి హడ్కో అందిస్తున్న సాంకేతిక, ఆర్థిక మార్గదర్శకాలు ఎంతో దోహదపడతాయన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ అందించేందుకు రూ.17,394 కోట్ల అంచనాతో ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అమృత్ 1.0, అమృత్ 2.0, UIDF, AIIB పథకాల ద్వారా ఇప్పటికే రూ.12,395 కోట్ల విలువైన పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కచ్చా డ్రైన్లను శాశ్వత డ్రైన్లుగా మార్చేందుకు దాదాపు రూ. 29,000 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. జనసాంద్రత ఆధారంగా హై, మీడియంలో డెన్సిటీ ప్రాంతాలుగా విభజించి పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో హై, మీడియం డెన్సిటీ ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను రూ. 9,000 కోట్లతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన అర్బన్ క్లియరెన్స్ ఫండ్‌లో రాష్ట్రానికి లభించే రూ. 3,600 కోట్లతో పాటు, రాష్ట్ర వాటాగా రూ. 10,800 కోట్లను హడ్కో మరియు ఇతర బ్యాంకుల ద్వారా సమీకరించేందుకు 72 మున్సిపాలిటీలకు రీపేమెంట్ సామర్థ్యం ఉందన్నారు. మిగిలిన మున్సిపాలిటీల్లో రూ. 5,000 కోట్ల విలువైన పనులను 'యాన్యుటీ మోడల్' ద్వారా చేపట్టేందుకు ఆర్థిక శాఖ అనుమతి లభించినట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల కారణంగా అవసరం లేకుండా మంచి రోడ్లు, డ్రైన్లను తొలగించి కొత్త నిర్మాణాలు చేపట్టవద్దని ఇంజనీర్లు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. నిజంగా అవసరమైన ప్రాంతాల్లో మాత్రమే పనులు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్లు పట్టణాల్లోని డ్రైన్లలో పూడికతీత (సిల్ట్ క్లియరెన్స్) పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. రెండో రోజు వర్క్ షాపులో మున్సిపల్ బాండ్స్ పై ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించనున్నారు. వర్క్ షాప్‌లో పబ్లిక్ హెల్త్ ఈఎన్సీ ఎమ్.ప్రభాకరరావు, సీఈ ఏ.సుధాకర్‌రావు, కార్తీక్, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్లు, ఫైనాన్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## వైసీపీ విష ప్రచారాలను రైతులు నమ్మొద్దు

మండిపడ్డారు. రైతుల్లో అయోమయం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనే కుట్రలో భాగంగానే ఈ తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వైసీపీ మరోసారి తన నీచమైన, దిగజారుడు రాజకీయాలకు తెరలేపిందని మంత్రి విమర్శించారు. రైతుల సంక్షేమం వంటి సున్నితమైన అంశాలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించడం, ప్రభుత్వంపై బురదజల్లడం, అబద్ధాలను నిజాలుగా చిత్రీకరించడం వైసీపీకి అలవాటుగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఎవరు ఎంత దుష్ప్రచారం చేసినా ప్రభుత్వం రైతుల పక్షానే నిలుస్తుంది. ఆధారాలు లేకుండా అబద్ధాలు సృష్టించి వాట్సాప్ గ్రూపుల్లో, సోషల్ మీడియాలో వైరల్ చేస్తే సహించేది లేదు. అలాంటి వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తాం అని మంత్రి హెచ్చరించారు. గత ఏడాది మామిడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకుందని గుర్తు చేశారు. రైతులకు నష్టం జరగకుండా తీసుకున్న చర్యల వల్ల వేలాది మంది రైతులకు ఊరట లభించిందన్నారు. ఈ ఏడాది కూడా మామిడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా, పరిశ్రమలతో సమన్వయం ఉండేలా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రైతుల పేరుతో రాజకీయాలు చేసే వైసీపీ నేతలు, సోషల్ మీడియా ముఠాలు అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి పూర్తి నిబద్ధత ఉందని, వారి ప్రయోజనాలను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మామిడి రైతులు ఎవరూ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ఏ సమస్య ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

## మహిళలతో పెట్టుకుంటే ఎవరైనా అధికారంలో ఉంటారా?

చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం" అన్నారు.

**వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలే..**

"అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారు. వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలు. ఆడబిడ్డ పుడితే.. మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనది. మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుంది. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది. భారత్‌కు స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుంది" అన్నారు.

**అందుకే ఆడపిల్లల డ్రాప్ అవుట్స్ తగ్గాయ్..**

ఆడ బిడ్డలు ఉచితంగా బస్సులో పక్క ఊరు వెళ్లి చదువుకుంటున్నారు. ఫ్రీ బస్సు వల్ల ఆడపిల్లల డ్రాప్‌అవుట్స్ తగ్గాయి. అంబానీ, ఆదానీలకు పోటీగా పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే మహిళా శక్తి భవనాలు నిర్మిస్తాం. హైటెక్‌సిటీ పక్కన రూ.వెయ్యికోట్ల భూమిని మహిళా సంఘాలకు ఇచ్చాం. రాష్ట్ర ఆర్థిక ప్రగతి మహిళల చేతుల్లోనే ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరలను ఏనాడైనా మహిళలు కట్టుకున్నారా? మా ప్రభుత్వం ఇచ్చిన చీర కట్టుకొనే మహిళలు ఈ సభకు వచ్చారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేవరకు విశ్రమించను. 2034 వరకు మీ ఆశీర్వాదంతో ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తాం" అన్నారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు

అంతర్జాతీయ విమానాశ్రయంపై టెహ్రాన్ చేసిన దాడిలో ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో ప్రయాణికులు, సిబ్బంది గాయపడ్డారు. మార్చిలోనూ కువైట్‌లోని ఓ విద్యుత్ నీటి శుద్ధి కర్మాగారంపై జరిగిన డ్రోన్ దాడిలో ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు.

## 'సింగప్పెన్' టాస్క్ ఫోర్స్'

నేరాలను ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై నేరాలకు మాదకద్రవ్యాల వ్యాప్తికి సంబంధం ఉందన్నారు. డ్రగ్స్‌కు అలవాటుపడిన వారే ఎక్కువగా ఇటువంటి నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. విద్యార్థినులు, ఉద్యోగాలు చేసే మహిళల భద్రత కోసం సింగప్పెన్ బృందం రాష్ట్ర వ్యాప్తంగా డ్రోన్‌లను మోహరిస్తుందని తెలిపారు. వాటి సహాయంతో ఎక్కడ ఎవరు మహిళలను వేధించినా తక్షణమే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## ఆరోపణలకు, విమర్శలకు ఆస్కారమివ్వొద్దు

శుభ్రం చేయాలన్నారు. హాస్టళ్లు, గురుకులాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టళ్లు, గురుకుల్లాల్లో చేరే విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. బీసీ బిడ్డలకు ఉన్నత విద్య అందించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో అత్యధిక మంది విద్యార్థులను చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలన్న లక్ష్యంలో భాగంగా ఐఐటీ, నీట్ కు ఉచిత శిక్షణ అందజేయనున్నామన్నారు. విశాఖ, టెకులోడు ఎంజేపీ స్కూళ్లలో రెండు ఉచిత నీట్, ఐఐటీ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. బాలురకు, బాలికలకు వేర్వేరుగా ఈ శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని, వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ శిక్షణా తరగతులు ప్రారంభించనున్నామని మంత్రి సవిత వెల్లడించారు.

**అమ్మకాలు పెంచండి..**

అనంతరం చేనేత, హస్త కళల అధికారులతో మంత్రి సవిత కీలక భేటీ నిర్వహించారు. తిరుపతి జిల్లాలో ఎన్ని ఆప్కో, లేపాక్షి షో రూమ్ లున్నాయన్నారు. ఆయా షో రూమ్ ల్లో అమ్మకాలు పెంచేలా చర్యలు తీసువాలని ఆదేశించారు. లేపాక్షి షో రూమ్ ల నిర్వహణకు తరంగా అనే యాప్ అనే ఆధారాత వ్యవస్థను సిద్ధం చేశామ్నారు. ఏనాటి అమ్మకాలను ఆనాడే ఈనాటి నుంచే చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత స్పష్టంచేశారు.


**మంత్రి సవితతో బీసీ సంఘ నేతల భేటీ**

తిరుపతి పర్యటనకు వచ్చిన మంత్రి సవితను పలువురు బీసీ సంఘ ప్రతినిధులు కలిశారు. బీసీల సంక్షేమానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చినందుకు మంత్రి సవితకు ధన్యవాదాలు తెలియజేసి, సత్కరించారు. మరికొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని కూడా పరిష్కరించాలని కోరారు. అందుకు మంత్రి సవిత సుముఖత వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో డీబీసీడబ్ల్యూవో భరత్ రెడ్డి సహా చేనేత, జౌళి శాఖ, లేపాక్షి అధికారులు పాల్గొన్నారు. మంత్రి సవితను కలిసిన వారిలో పలువురు కార్పొరేషన్ చైర్మన్లు ఆర్.సదాశివ, ఎస్.త్యాగరాజన్, వి.చంద్ర శేఖర్ సహా పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అన్నదాతల ఆక్రందన
## కార్పొరేట్ కంపెనీల కాసుల వేట!

ఈ దేశంలో సాగుబడి అంటేనే ఒక జూదం. వాన రాకపోయినా, వరద ముంచెత్తినా నష్టపోయేది ఒక్కడే. వాడు మన దేశానికి వెన్నెముక అని చెప్పుకునే రైతు. అప్పుల ఊబిలో కూరుకుపోయి, కరువు నేలపై, దిక్కుతోచని స్థితిలో అతడు ఒంటరిగా కన్నుమూస్తాడు. కానీ, అతడి కష్టాన్ని పెట్టుబడిగా మార్చుకున్న బీమా కంపెనీలు మాత్రం కోట్లతో తులతూగుతున్నాయి! సర్కార్ సొమ్మును దర్జాగా తింటూ, రైతన్నల నిస్సహాయతను తమ లాభాలుగా మార్చుకుంటున్నాయి. ఇది కేవలం పత్రికా విమర్శ కాదు, కళ్ళముందు కదలాడుతున్న నిర్దాక్షిణ్యమైన పచ్చి వాస్తవం. భారత ప్రభుత్వం 2016లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అనే పంట బీమా పథకాన్ని తెరపైకి తెచ్చింది. లక్షల కోట్ల బడ్జెట్‌తో పేజీలకు పేజీలు రంగుల ప్రకటనలు ఇచ్చి, ఇకపై రైతన్నల కన్నీళ్ళు తుడుస్తాం అంటూ పెద్ద పెద్ద హామీలు గుప్పించింది. కానీ, కాలచక్రం తిరిగినా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇసుమంతైనా మారలేదు. రైతు కన్నీళ్ళు అలాగే ఉన్నాయి, కానీ ఈ కార్పొరేట్ కంపెనీల లాభాల గ్రాఫ్ మాత్రం ఆకాశాన్ని తాకింది. ఇక్కడ మిగిలిన ఒకే ఒక్క మిలియన్ డాలర్ల ప్రశ్న.ఈ ప్రతిష్టాత్మక పథకం అసలు చెమటోడ్చే రైతు కోసమా, లేక కోట్లు కుమ్మరించే కార్పొరేట్ శక్తుల కోసమా?గత ఆరు సంవత్సరాలుగా ఈ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు రైతులు కలిసి చెల్లించిన ప్రీమియం అక్షరాలా రూ. 1.5 లక్షల కోట్లకు పైమాటే. అయితే ఇందులో ఆశ్చర్యకరమైన, విచారకరమైన విషయం ఏమిటంటే, రైతులకు తిరిగి దక్కిన క్లెయిమ్‌ల శాతం కేవలం 60 నుండి 70 లోపే! మరి మిగిలిన ఆ వేల కోట్ల ప్రజాధనం ఎటు పోయింది? సింపుల్ అదంతా బీమా కంపెనీల ఖాతాల్లోకి నికర లాభాలుగా చేరిపోయింది.ఒక సామాన్య రైతు తనకున్న కొద్దిపాటి భూమికి ఎకరానికి వందల రూపాయల చొప్పున కష్టార్జితాన్ని ప్రీమియంగా కడతాడు. దానికి తోడు, ప్రభుత్వం కూడా తన వాటాను భారీగా జమ చేస్తుంది. తీరా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట చేతికందకుండా పోయినప్పుడు, పరిహారం కోసం రైతు కార్యాలయాల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరగాలి. అప్పుడు కంపెనీలు చూపే సాకులు అన్నీ ఇన్నీ కావు.ఇంకా క్షేత్రస్థాయి సర్వే పూర్తి కాలేదు.శాంపిల్ క్రాప్ కటింగ్ నివేదికలు రావాల్సి ఉంది.ఆన్‌లైన్ అప్లికేషన్‌లో సాంకేతిక లోపాలున్నాయి.పరిహారం క్లెయిమ్ చేయడానికి గడువు దాటిపోయింది.ఇలాంటి వంకలతో నెలల తరబడి అన్నదాతలను మానసిక క్షోభకు గురిచేస్తారు. ఒకవేళ ఏళ్ళ నిరీక్షణ తర్వాత పరిహారం మంజూరైనా, అది చేతికి వచ్చేసరికి కేవలం కాసుల రూపంలో, నామమాత్రంగానే మిగులుతుంది. ఇది రైతులకు రక్షణ కల్పించే బీమా కాదు, ముమ్మాటికీ వారిని బురిడీ కొట్టించే పెద్ద మాయాజాలం!ప్రస్తుత ఆధునిక కాలంలో కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ శాంపిల్ క్రాప్ కటింగ్ రిమోట్ సెన్సింగ్ ,శాటిలైట్ ఇమేజరీ అంటూ సరికొత్త సాంకేతిక పదాలతో పెద్ద హడావుడి చేస్తోంది. అయితే ఈ టెక్నాలజీ రైతులకు సాయం చేయడానికి కాదు, పరిహారం మొత్తాన్ని ఎంత వీలైతే అంత తగ్గించడానికి వాడుతున్న ఒక మాయా అస్త్రం.గగనతలం నుంచి ఉపగ్రహం తీసిన నివేదికలో ఏదైనా ఒక నిర్దిష్ట ప్రాంతంలో పంట పచ్చగా ఉన్నట్టు కనిపిస్తే చాలు, ఆ పరిసర గ్రామాలన్నింటికీ బీమా నిరాకరిస్తారు. క్షేత్రస్థాయిలో రైతు నేరుగా నిలబడి, అయ్యా, నా పొలం తెగుళ్ళతో పూర్తిగా నాశనమైంది, వచ్చి చూడండి అని నెత్తీ నోరూ బాదుకున్నా వినే నాథుడే లేడు. ఎందుకంటే ఉపగ్రహానికి రైతన్న కళ్ళల్లోని తడి కనిపించదు. దానికి తెలిసింది కేవలం స్క్రీన్ మీది డేటా మాత్రమే. ఆ డేటా కూడా చివరికి ఆయా కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు అనుకూలంగానే మారడం గమనార్హం.ఇక్కడ మనం నిలదీయాల్సిన అసలైన ప్రశ్న ఒకటి ఉంది: దేశాన్ని ఏలే పాలకులకు ఈ ఘోరమైన వాస్తవాలు తెలియవా? కచ్చితంగా తెలుసు, సంపూర్ణంగా తెలుసు. పార్లమెంటరీ స్థాయీ సంఘాలు, కాగ్ నివేదికలు, వివిధ రైతు సంఘాల అధ్యయనాలు అన్నీ ముక్తకంఠంతో ఒకే విషయాన్ని స్పష్టం చేశాయి. ఈ పంట బీమా పథకం అమలులో తీవ్రమైన లొసుగులు ఉన్నాయని, కంపెనీలు అడ్డగోలుగా లాభపడుతుంటే సాగుదారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తేల్చిచెప్పాయి.

అయినా సరే, పాలకులు తీసుకున్న చర్యలు శూన్యం. కేవలం పథకాల పేర్లు మార్చారు, రంగురంగుల లోగోలు మార్చారు తప్ప క్షేత్రస్థాయిలో లోపభూయిష్టమైన వ్యవస్థను మార్చలేదు. ఇదంతా యాదృచ్ఛికంగా జరుగుతోందా అంటే ఎవరూ నమ్మరు. ఎన్నికల వేళ ఈ కార్పొరేట్ శక్తులు ఏయే రాజకీయ పార్టీలకు నిధులు సమకూరుస్తున్నాయో, ఏ తరహా లాబీయింగ్ నడుపుతున్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఓటు వేసే రైతు కంటే, నోట్ల కట్టల చెక్కులు ఇచ్చే కార్పొరేట్ కంపెనీలకే పాలకులు పెద్దపీట వేస్తున్నారనేది బహిరంగ రహస్యం.ఈ వైఫల్యంలో కేవలం కేంద్రానిదే తప్పు అనలేం. ఇందులో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర కూడా సమానంగా ఉంది. స్థానికంగా ఏ బీమా కంపెనీని ఎంచుకోవాలి, ప్రీమియం రేట్లను ఎలా ఖరారు చేయాలి, క్రాప్ కటింగ్ ప్రయోగాలు ఎలా నిర్వహించాలి అనేవన్నీ రాష్ట్రాల పరిధిలోనే ఉంటాయి. అయినప్పటికీ, అన్నదాతల నుంచి వస్తున్న వేలాది ఫిర్యాదులను ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో లక్షలాది మంది రైతులు తమకు రావాల్సిన ఇన్సూరెన్స్ సొమ్ము కోసం ఏళ్ళ తరబడి కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. కొందరికి తాము దరఖాస్తు చేసుకున్న ఫైల్ ఎక్కడుందో తెలియదు, మరికొందరి ఖాతాల్లో పడాల్సిన సొమ్ము సాంకేతిక తప్పిదాల వల్ల ఎవరిదో అకౌంట్లలోకి వెళ్ళిపోతోంది. ఇది కేవలం అధికారుల అసమర్థత కాదు, వ్యవస్థ అంతా కలిసి చేస్తున్న ఒక సంఘటిత నేరం! ఈ ఘోరమైన వ్యవస్థ వల్ల నలిగిపోతున్న ఒక సగటు రైతు వేదనను పరిశీలిస్తే గుండె తరుక్కుపోతుంది. ఉదాహరణకు, కృష్ణా జిల్లాకు చెందిన ఒక సామాన్య రైతు పది ఎకరాల్లో కష్టపడి వరి సాగు చేశాడు. పెట్టుబడి కోసం బ్యాంకులో అప్పు తీసుకుంటే, అధికారులు ముందే ఇన్సూరెన్స్ ప్రీమియం మొత్తాన్ని మినహాయించుకున్నారు. దురదృష్టవశాత్తూ సెప్టెంబర్ నెలలో వచ్చిన భారీ వరదలకు పంట మొత్తం మునిగిపోయింది. వెంటనే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినా, అధికారులు రాలేదు. ఆరు నెలల తర్వాత పరిశీలనలో ఉంది అన్నారు. ఏడాది గడిచాక మీ ప్రాంతంలో పంట నష్టం నమోదు కాలేదు అంటూ ఒకే ఒక్క కంప్యూటర్ క్లిక్‌తో ఆ క్లెయిమ్‌ను కొట్టేశారు.ఆ రైతు మళ్ళీ అప్పులు చేశాడు, మళ్ళీ నమ్మకంతో సాగు మొదలుపెట్టాడు, మళ్ళీ నిబంధనల ప్రకారం ప్రీమియం కట్టాడు. ఇది కేవలం వ్యవసాయంపై ఉన్న భక్తి కాదు, అంతకుమించి ప్రత్యామ్నాయం లేని ఒక సామాన్యుడి నిస్సహాయత!సమస్యలను ఎత్తిచూపడమే కాదు, దానికి సరైన మార్గాలను సూచించడం కూడా అంతే ముఖ్యం. ఈ దోపిడీ వ్యవస్థ మారాలంటే తక్షణమే ఈ క్రింది సంస్కరణలు చేపట్టాలి. పంట బీమా నిర్వహణను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం తక్షణమే ఆపాలి. ప్రభుత్వ రంగ బీమా సంస్థల ద్వారానే దీనిని అమలు చేయాలి. అప్పుడే లాభాపేక్ష పక్కనపెట్టి సేవా దృక్పథంతో రైతుకు న్యాయం జరుగుతుంది. కేవలం శాటిలైట్ ఇమేజ్‌లపై ఆధారపడకుండా, స్థానిక రైతు సమక్షంలో, గ్రామ సభల ద్వారా పారదర్శకంగా పంట నష్టాన్ని అంచనా వేయాలి. పంట నష్టం జరిగిన 30 రోజుల్లోగా పరిహారం నేరుగా రైతు ఖాతాలో జమ కావాలి. జాప్యం జరిగితే బాధ్యులైన అధికారులపై, కంపెనీలపై జరిమానా విధించాలి. బీమా కంపెనీల లాభ నష్టాలపై ప్రతి సంవత్సరం పార్లమెంటరీ ఆడిట్ జరగాలి. ఆ నివేదికలను బహిరంగంగా ప్రజల ముందు ఉంచాలి.రైతు తన మొబైల్ ద్వారానే నష్టపోయిన పంట పొలం ఫోటోలు, వీడియోలు అప్‌లోడ్ చేసి, నేరుగా క్లెయిమ్ చేసుకునేలా సులువైన సాంకేతికతను అందుబాటులోకి తేవాలి.రైతే దేశానికి వెన్నెముక అనే స్లోగన్ ప్రతి ఎన్నికల మేనిఫెస్టోలోనూ వినిపిస్తూనే ఉంటుంది. కానీ ఆ వెన్నెముక విరిగిపోతుంటే కేవలం నినాదాలు చేయడం ఏ రకమైన రాజకీయం? నరేంద్ర మోదీ ప్రభుత్వం 2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రకటించిన గడువు ఎప్పుడో ముగిసిపోయింది. కానీ క్షేత్రస్థాయిలో మిగిలింది కేవలం ఆర్భాటపు ప్రకటనలు, అప్పుల బాధతో తనువు చాలిస్తున్న రైతుల గణాంకాలు మాత్రమే.ఈ వ్యాసం చదువుతున్న ప్రతీ ఒక్కరికీ ఒకే ఒక్క విన్నపం. మీరు వ్యవసాయం చేయకపోవచ్చు, కానీ రోజుకు మూడు పూటలా తినే అన్నం ఆ రైతన్న కష్టం వల్లే వస్తోంది. మీ పళ్లెంలో ఉన్న ప్రతి బియ్యపు గింజ వెనుక ఒక మనిషి రక్తం, చెమట దాగున్నాయి. ఆ అన్నదాతకు అన్యాయం జరుగుతున్నప్పుడు సమాజంగా మనం మౌనంగా ఉండటం తగదు. ఓటు వేసేటప్పుడు పాలకులను నిలదీయాలి, వారిని జవాబుదారీలుగా మార్చాలి. ఇది కేవలం రైతుల పోరాటం కాదు, మన సమాజపు నైతిక యుద్ధం. పాలకులు నిద్ర నటిస్తున్నంత కాలం ఈ దోపిడీ సాగుతూనే ఉంటుంది, మనం మేల్కొని ప్రశ్నించినప్పుడే అన్నదాతకు నిజమైన న్యాయం జరుగుతుంది!



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# ఎడిటర్ వాయిస్

## బాబు అభిమానికి జీవిత కాలం సరిపడి గిఫ్ట్!

తెలుగుదేశం అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబుది సుదీర్ఘమైన రాజకీయ జీవితం. ఆయనకు ఎంతో మంది అభిమానులు ఉన్నారు. వారంతా బాబు పేరు చెబితే ఎంతో ఎమోషన్ అవుతారు. దూరం నుంచి బాబుని చూడాలని విక్టరీ సింబల్ చూపించి ఆయన కళ్లలో పడాలని తపిస్తారు. అంతే కాదు బాబుగారూ అంటూ ఎక్కడ నుంచో పిలిచి ఆయన తమ వైపు చూసేలా చేయాలని కూడా విశ్వ ప్రయత్నం చేస్తారు. బాబు జిల్లాల టూర్లకు వెళ్ళినపుడు ఇలాంటివి ఎన్నో జరుగుతాయి. అలాగే పశ్చిమ గోదావరి సిద్ధాంతంలో ఒక అరవీర భయంకరమైన అభిమాని చంద్రబాబుకు ఉన్నారు. ఆయన పేరు సత్యనారాయణ. బాబును అలా ఎక్కడో దూరం నుంచి చూస్తే చాలు తన జన్మ ధన్యం అయినట్లుగా సత్యనారాయణ భావిస్తారు. ఎనభై ఏళ్ళ వయసు ఉన్న సత్యనారాయణ బాబు కోసం ఈ ఏజ్ లో కూడా సైకిల్ సవారీ చేసి మరీ ఆయన సభా ప్రాంగణాన్ని చేరుకోవడానికి ఉత్సాహం చూపించారు అంటే షాక్ తినాల్సిందే. ఇక సత్యనారాయణ బాబును ఎలాగైనా చూడాలని వ్యక్తం చేసిన కోరికను సోషల్ మీడియా ద్వారా చూసిన చంద్రబాబు తప్పకుండా కలుసుకుందాం సత్యనారాయణ గారు అని ట్వీట్ చేసారు. అన్నట్లుగానే ఆయన సిద్ధాంతంలో తన వీరాభిమానిని తన వద్దకు రప్పించుకుని ఆయన జీవిత కాలానికి సరిపడా మధురమైన అనుభూతిని అందించారు.

**బాబు హగ్ తో హ్యాపీ :** ఇదిలా ఉంటే ఎప్పటి నుంచో తనను చూడాలనుకుంటున్న అభిమాని కోరికను ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం కామధేనువు లంక గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వృద్ధుడు చంద్రబాబుకు వీరాభిమానిగా స్థానికంగా పేరు గడించారు. ఇక తమ నియోజకవర్గానికి చంద్రబాబు వస్తున్నారని దూరం నుంచైనా ఆయన్ను చూడాలని మాట్లాడిన వీడియో వైరల్ అయ్యి నేరుగా చంద్రబాబు దృష్టికి వెళ్ళింది. ఈ నేపథ్యంలో సోమవారం మీ భూమి -- మీ హక్కు కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్దాంతం వెళ్లిన చంద్రబాబు ఆ కార్యక్రమం అనంతరం తన బస్సులోకి సత్యనారాయణను ప్రత్యేకంగా పిలుపించుకున్నారు. కాసేపు ఆత్మీయంగా మాట్లాడి కుటుంబ వివరాలు ఆరోగ్యం గురించి ఆరా తీశారు.

**భరోసా ఇచ్చిన బాబు :** ఇదిలా ఉంటే నేరుగా ముఖ్యమంత్రి తన వద్దకు అభిమానిని పిలిపించుకోవడంతో సత్యనారాయణ ఎంతగానో మురిసిపోయారు. తన కుటుంబం వివరాలు కూడా బాబుతో చెప్పుకున్నారు. తన కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని అతనికి వైద్యసాయం అందించాలని సత్యనారాయణ ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు. తమ గ్రామానికి డ్రైనేజ్ సదుపాయం కల్పించాలని కూడా సామాజిక బాధ్యతగా ఊరి గురించి కూడా ముఖ్యమంత్రికి విన్నవించారు. దీంతో తన అభిమాని కుమారుడికి వైద్యం చేయిస్తానని భరోసా ఇచ్చిన బాబు సత్యనారాయణకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆ కలెక్టర్‌ను అక్కడికక్కడే ఆదేశించారు. ఇదిలా ఉండగా బాబు ఇంతలా తన అభిమాని కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించి భరోసా ఇవ్వడంతో బాబు అభిమానులు అంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఇక సత్యనారాయణ విషయం అంతే వేరే లెవెల్. జీవితకాలం సరిపడా బాబు ఒక మంచి బహుమతి ఇచ్చారని అంటున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## కన్నతండ్రిని చంపిన కర్కోటకులకు ఉరిశిక్ష

**సహకరించిన తల్లికి జీవిత ఖైదు – సంచలన తీర్పు వెలువరించిన మల్కాజిగిరి కోర్టు**
**పింఛను డబ్బు కోసం కుమారుడు, కుమార్తె ఘాతుకం**



**మల్కాజిగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** పింఛను డబ్బు కోసం కన్నతండ్రిని దారుణంగా హత్య చేసిన కేసులో మల్కాజిగిరి న్యాయస్థానం సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ దారుణానికి పాల్పడ్డ కుమారుడు, కుమార్తెకు ఉరిశిక్ష, సహకరించిన మృతుడి భార్యకు జీవిత ఖైదు విధించింది. వివరాల్లోకి వెళ్తే... హైదరాబాద్ మౌలాలిలోని డాక్టర్ కృష్ణానగర్, రైల్వేకాలనీకి చెందిన మారుతి సుతార్(70) విశ్రాంత రైల్వే ఉద్యోగి. అతనికి భార్య గంగాబాయి, కుమారుడు కిషన్ సుతార్, కుమార్తెలు అనుపమ, ప్రఫుల్ల ఉన్నారు. పెద్ద కుమార్తె అనుపమకు వివాహమై పుణెలో ఉంటోంది. కిషన్, ప్రఫుల్ల ఇంట్లోనే ఖాళీగా ఉండేవారు. మారుతికి ప్రతి నెలా వస్తున్న రూ.30 వేల పింఛనుతోనే ఇల్లు గడిచేది. అడిగినప్పుడల్లా డబ్బులు ఇవ్వకపోవడంతో కక్ష పెంచుకున్న భార్య, కుమారుడు, కుమార్తె.. మారుతిని అడ్డు తొలగించుకుంటే పింఛనుతోపాటు బ్యాంకులో ఉన్న డబ్బు తమ సొంతం అవుతాయని భావించి హత్యకు పథకం వేశారు.

**ఇంటర్నెట్‌లో వెతికి మరీ...**

హత్య ఎలా చేయాలనే దానిపై కూతురు ఇంటర్నెట్‌లో వెతికినట్టు పోలీసు విచారణలో వెల్లడైంది. పథకం ప్రకారం 2019 ఆగస్టు 16న ఉమ్మెత్త పూలు, కాయలు ఎండబెట్టి పొడి చేసి మారుతి తినే భోజనంలో కలిపి పరీక్షించారు. రెండు రోజులు అలా చేశాక మూడో రోజు మోతాదు పెంచడంతో మారుతి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. దాంతో అతడిని కత్తులతో పాశవికంగా నరికి శరీర భాగాలను బకెట్లలో నింపి దాచారు. ఎవరూ లేని సమయంలో వాటిని బయట పడేయాలని ప్రయత్నించినా.. ఎదురింట్లో శుభకార్యం జరుగుతుండటంతో వీలు కాలేదు. ఆగస్టు 18న దుర్వాసన వస్తోందని స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూడగా.. బకెట్లలో దాచిన శరీర భాగాలు కనిపించడంతో అంతా షాక్‌కు గురయ్యారు. ఈలోగా గంగాబాయి, ప్రఫుల్ల.. కిషన్‌ను పిలుస్తామంటూ పారిపోయారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అప్పటి మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్లు ఎ.మన్మోహన్ యాదవ్, బి.జగదీశ్వరరావు కోర్టులో అభియోగపత్రాన్ని సమర్పించగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి వి.బాలభాస్కర్‌రావు తీర్పు వెలువరించారు.

## బాసర గోదావరి నదిలో ముగ్గురు అన్నదమ్ముల గల్లంతు



**బాసర, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర వద్ద గోదావరి నదిలో ముగ్గురు అన్నదమ్ములు గల్లంతయ్యారు. ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లోని కాచిగూడ నుంచి బాసరకు చేరుకున్న ఈ ముగ్గురూ.. గోదావరిలో పుణ్యస్నానానికి దిగి గల్లంతయ్యారు. కాచిగూడలోని చప్పల్‌బజార్‌కు చెందిన చంద్రశేఖర్ (38), రామచందర్ (36), మల్లేశ్‌కుమార్(31) నదిలో మునిగిపోవడంతో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు పర్యవేక్షిస్తున్నారు.

**ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్**

## నివాసంలో ఏసీబీ సోదాలు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మాదాపూర్‌లోని ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్ నివాసంలో ఏసీబీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కలిగిఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో మోహన్ నాయక్ ఇంటితోపాటు 15 ప్రాంతాల్లోని ఆయన బంధువుల నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. అతడి ఇంట్లో 20కి పైగా విదేశీ మద్యం సీసాలను గుర్తించారు. ఇవాళ ఉదయం నుంచి తనిఖీలు కొనసాగుతున్నాయని, సోదాలు పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

**ఇంట్లో రూ.60లక్షల నగదు గుర్తించాం : ఏసీబీ జాయింట్ డైరెక్టర్**

మోహన్ నాయక్ ఇంట్లో చేపట్టిన తనిఖీల్లో రూ.60లక్షల నగదు గుర్తించినట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. కిలో బంగారు నగలు, 13 బంగారు బిస్కెట్లు గుర్తించినట్లు తెలిపారు. ఏకకాలంలో 15 ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయన్నారు. హైదరాబాద్, నిజామాబాద్‌లో ఇళ్ల స్థలాల పత్రాలు గుర్తించామని తెలిపారు. మరోవైపు, మోహన్ నాయక్ కార్యాలయంలోనూ ఏసీబీ సోదాలు జరిపింది. ఎర్రమంజిల్‌లోని కార్యాలయంలో పలు ఫైళ్లను తనిఖీ చేస్తున్నారు. అక్కడి అధికారుల నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నారు.

## వాటర్ ట్యాంక్ ఎక్కి ఉద్యోగి నిరసన



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలో మున్సిపల్ వాటర్ ట్యాంక్ ఎక్కి ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మంగళవారం నిరసన తెలిపారు. సానిటరీ వర్కర్ మల్లారపు మీరాసాహెబ్ తనకు 8 నెలల నుంచి జీతం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారగా, వాటర్ ట్యాంక్ పైనున్న ఉద్యోగిని కిందికి దించేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

## జాతీయ రహదారిపై బైక్‌ను ఢీ కొన్న కారు

**రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పెయింట్ పనులు చేసే కార్మికులకు గాయాలు**



**నెల్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లూరు జిల్లా కోవూరు సమీపంలో నేషనల్ హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రోడ్డు మార్కింగ్ పెయింట్ పనులు చేసేందుకు బైక్ పై వెళుతున్న వారిని వెనకనుండి కార్ ఢీ కొట్టడంతో వారికి గాయాలయ్యాయి. గాయపడిన వారు నెల్లూరు బాలాజీ నగర్ చెందిన వారిగా గుర్తింపు.

**బాలిక అదృశ్యం ఘటనలో**

## ప్రజలను కన్నీరు పెట్టిస్తున్న శునకం

**తుని, విశ్వం వాయిస్ న్యూస్ :** జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. చిన్నారితో పాటు అదృశ్యమైన పెంపుడు కుక్క ఆచూకీతోటలో కుక్కను గుర్తించిన గాలింపు బృందాలు కుక్కను పట్టుకునేందుకు ప్రయత్నించగా కరవ పోయిన పెంపుడు కుక్క. కుక్క కనిపించిన ప్రాంతంలో ముమ్మర గాలింపు. చిన్నారి ఆచూకీ కోసం కొనసాగుతున్న శోధన. పోలీసుల దర్యాప్తులో కీలక మలుపు తిరిగిన కేసు.

## భానుగుడి సెంటర్ వద్ద కారు దగ్ధం



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ భానుగుడి సెంటర్ పద్మప్రియ థియేటర్ సమీపంలో రెనాల్ట్ ట్రిగ్గర్ కార్ అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న స్థానిక అగ్నిమాపక సిబ్బంది, టూ టౌన్ సీఐ అప్పలనాయుడు, పోలీస్ సిబ్బంది గిరి, ప్రసాద్ ఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట లేక ఇతర కారణాల అనేదానిపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

## రెండు లారీలు ఢీకొని మంటలు

**ఒకరి సజీవదహనం**



**అనంతపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు లారీలు ఢీకొని ఒకరు సజీవదహనమయ్యారు. డి.హీరేహాల్ మండలం జాజరకల్ టోల్ ప్లాజా వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న సిమెంట్ ట్యాంకర్‌ను మరో లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రెండు లారీల్లోనూ మంటలు చెలరేగాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానిక ప్రజలు మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు.

# హెల్త్ వాయిస్

## అన్నం తిన్నాక పండ్లు తింటే ఏమవుతుంది..?

**మీ బాడీలో ఏం జరుగుతుందో తెలిస్తే షాకే..**



పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయని అందరికీ తెలుసు. కానీ మీరు వాటిని తినే సమయం మీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని మీకు తెలుసా? చాలామంది భోజనం ముగిశాక డెజర్ట్‌గా పండ్లను తింటుంటారు. అయితే ఇది అమృతమా లేక జీర్ణవ్యవస్థకు శాపమా? భోజనం తర్వాత వెంటనే పండ్లు తింటే కడుపులో ఏం జరుగుతుంది? అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నది కాదనలేని సత్యం. విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే పండ్లు మనల్ని రోగాల నుండి రక్షిస్తాయి. అయితే చాలామంది భోజనం ముగిసిన తర్వాత డెజర్ట్ లాగా పండ్లను తింటుంటారు. మరి ఇలా భోజనం తర్వాత వెంటనే పండ్లు తినడం సరైనదేనా? దీనివల్ల జీర్ణవ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుంది? ఆరోగ్య నిపుణులు ఏమంటున్నారో వివరంగా తెలుసుకుందాం.

**ఎందుకు జాగ్రత్తగా ఉండాలి?**

సాధారణంగా పండ్లలో ఉండే సహజ చక్కెరలు, ఫైబర్ చాలా త్వరగా జీర్ణమవుతాయి. కానీ మనం తినే భారీ భోజనంలోని ప్రోటీన్లు, కొవ్వులు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. భోజనం తర్వాత వెంటనే పండ్లు తింటే, అవి జీర్ణకోశంలో భోజనంతో కలిసిపోయి జీర్ణ ప్రక్రియను మందగింపజేస్తాయి. దీనివల్ల కొంతమందిలో గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా ఐబీఎస్ లేదా ఫ్రక్టోజ్ అసహనం ఉన్నవారు భోజనం తర్వాత పండ్లు తింటే అసౌకర్యానికి గురయ్యే అవకాశం ఉంది.

**పోషకాలు అందవా? అపోహలు vs వాస్తవాలు**

భోజనంతో పాటు పండ్లు తింటే పోషకాలు అందవని చాలామంది నమ్ముతుంటారు. కానీ ఇందులో నిజం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మానవ జీర్ణవ్యవస్థ ఆహారం నుండి గరిష్ట పోషకాలను గ్రహించేలా రూపొందించబడింది. చిన్న ప్రేగు చాలా పొడవుగా ఉండి, పోషకాలను నెమ్మదిగా, సమర్థవంతంగా గ్రహిస్తుంది. కాబట్టి భోజనం తర్వాత పండ్లు తిన్నా పోషకాల లోపం ఏర్పడదు.

**జీర్ణక్రియకు తోడ్పడే సూపర్ పండ్లు**

అన్ని పండ్లు భోజనం తర్వాత ఇబ్బంది కలిగించవు. కొన్ని పండ్లు జీర్ణక్రియను మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. బొప్పాయి, పైనాపిల్‌లో ఉండే ఎంజైమ్‌లు మనం తిన్న ఆహారంలోని ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడంలో సహాయపడతాయి. కివి, బెర్రీలు కూడా భోజనం తర్వాత సులభంగా జీర్ణమై, శరీరానికి మేలు చేస్తాయి.

**నిపుణుల సలహా**

మీకు జీర్ణ సంబంధిత సమస్యలు ఏవీ లేకపోతే భోజనం తర్వాత పండ్లు తీసుకోవచ్చు. అయితే పండ్ల నుండి పూర్తి ప్రయోజనం పొందాలనుకుంటే, భోజనానికి గంట ముందు లేదా రెండు గంటల తర్వాత తీసుకోవడం ఉత్తమ వ్యూహమని నిపుణులు సూచిస్తున్నారు.

## మల్టీవిటమిన్ తీసుకోవడం మంచిదా.. చెడ్డదా..?

**నిపుణులు ఏం చెబుతున్నారంటే..?**

పని ఒత్తిడి, అనారోగ్యకరమైన జీవనశైలి, పెరుగుతున్న ఫాస్ట్ ఫుడ్ వినియోగం కారణంగా, చాలా మంది వారి ఆహారంలో అవసరమైన పోషకాలను పొందడం లేదు. అందువల్ల, కొంతమంది వారు తాము స్వయంగా మల్టీవిటమిన్లను తీసుకోవడం ప్రారంభించారు. కొందరు దీన్ని రోగనిరోధక శక్తి పెంచడానికి, అలసట తగ్గించడానికి, లేదా శక్తిని పొందడానికి ఉపయోగిస్తారు. నేటి ఉరుకులు పరుగుల జీవనశైలిలో చాలా మందికి తమ ఆహారంపై సరైన శ్రద్ధ పెట్టడం కష్టంగా మారింది. ఫలితంగా, శరీరానికి అవసరమైన పోషకాలను అందించడానికి మల్టీవిటమిన్ల వైపు ఆసక్తి పెరుగుతుంది. మల్టీవిటమిన్లు అనేవి విటమిన్లు A, B, C, D, E, ఇనుము, కాల్షియం, జింక్ వంటి వివిధ విటమిన్లు, నిజాలను కలిగిన సప్లిమెంట్లు. ఇవి శరీరంలో పోషక లోపాలను భర్తీ చేయడంలో సహాయపడతాయి. సాధారణంగా, ఆహారం అసమతుల్యంగా ఉన్నప్పుడు లేదా విటమిన్/ఖనిజ లోపం ఉన్నప్పుడు వైద్యులు మల్టీవిటమిన్లను సిఫార్సు చేస్తారు. పని ఒత్తిడి, అనారోగ్యకరమైన జీవనశైలి, పెరుగుతున్న ఫాస్ట్ ఫుడ్ వినియోగం కారణంగా, చాలా మంది వారి ఆహారంలో అవసరమైన పోషకాలను పొందడం లేదు. అందువల్ల, కొంతమంది వారు తాము స్వయంగా మల్టీవిటమిన్లను తీసుకోవడం ప్రారంభించారు. కొందరు దీన్ని రోగనిరోధక శక్తి పెంచడానికి, అలసట తగ్గించడానికి, లేదా శక్తిని పొందడానికి ఉపయోగిస్తారు.

**రోజువారీ మల్టీవిటమిన్ తీసుకోవడం మంచిదా?**

RML హాస్పిటల్‌లో మెడిసిన్ విభాగం డైరెక్టర్




ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ గిరి దీనిపై స్పందించారు. ప్రతీ ఒక్కరికీ రోజువారీ మల్టీవిటమిన్ అవసరం ఉండదు. సమతుల్యమైన ఆహారం (పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, పప్పు, ప్రోటీన్) తీసుకుంటే, శరీరం సాధారణంగా అవసరమైన విటమిన్లు, ఖనిజాలను పొందుతుంది. కాబట్టి, రోజువారీ మల్టీవిటమిన్ తప్పనిసరి కాదు, అది ఖచ్చితంగా అవసరమైన సందర్భాల్లో మాత్రమే తీసుకోవాలని సూచించారు. కొన్ని విటమిన్లు అధికంగా తీసుకుంటే శరీరానికి హానికరం అవుతాయి. కాబట్టి, మల్టీవిటమిన్లను వైద్య సలహాతో మాత్రమే తీసుకోవడం మంచిది, ముఖ్యంగా పోషక లోపం ఉన్నవారికి.

**ఎవరు మల్టీవిటమిన్లు తీసుకోవాలి?**

అసమతుల్య ఆహారం తీసుకునేవారు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే స్త్రీలు, కొన్ని వైద్య పరిస్థితులు ఉన్నవారు, దీర్ఘకాలిక అలసట, బలహీనత లేదా పోషకాహార లోపం ఉన్నప్పుడు కూడా వైద్యులు సప్లిమెంట్లను సిఫార్సు చేస్తారు. కానీ, ప్రతి వ్యక్తి అవసరాలు భిన్నంగా ఉంటాయి, కాబట్టి మల్టీవిటమిన్లు ప్రారంభించే ముందు వైద్యుని సంప్రదించడం మంచిది.

**ముఖ్యమైన సూచనలు**

మల్టీవిటమిన్లు సమతుల్య ఆహారం ప్రత్యామ్నాయంగా ఉండకూడదు. పండ్లు, ఆకుపచ్చ కూరగాయలు, ధాన్యాలు, పప్పు, పాలు వంటి సహజ ఆహారాలు శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలను అందిస్తాయి. సప్లిమెంట్లు సురక్షితంగా ఉండటానికి, సరైన మోతాదులో, సరైన సమయంలో మాత్రమే తీసుకోవాలి.

## ప్రజా వ్యతిరేక పాలనపై ప్రశ్నిస్తే నిర్బంధాలా..?

**- పోలీసులను ప్రయోగించి ప్రతిపక్ష గొంతు నొక్కుతారా? -144 సెక్షన్ పేరుతో వైఎస్సార్సీపీ నేతల నిర్బంధం**

**- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రభుత్వం -ప్రతిపక్ష కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం**

**-కమ్యూనిటీ హాల్‌కు తాళాలు వేసి సమావేశానికి అడ్డంకులు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం తన రెండేళ్ల పాలనలో చేసిన వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాలను అడ్డుకునేందుకు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని మాజీ ఎంపీ, వైఎస్సార్సీపీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ తీవ్రంగా విమర్శించారు. పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు 175 నియోజకవర్గాల్లో ప్రభుత్వ హామీల అమలు, ప్రజలకు జరిగిన అన్యాయాలను వివరించే కార్యక్రమాలు జరుగుతుండగా, రాజమహేంద్రవరంలో మాత్రం ప్రత్యేకంగా పోలీసు నిర్బంధాలు, ఆంక్షలు విధించడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు.

**144 సెక్షన్ పేరుతో ప్రతిపక్షాలపై ఉక్కుపాదం**

శాంతియుతంగా నిర్వహించాల్సిన రౌండ్ టేబుల్ సమావేశానికి అనుమతులు నిరాకరించడం, కమ్యూనిటీ హాల్‌కు తాళాలు వేయించడం, పార్టీ నాయకులను ముందుకు వెళ్లనీయకుండా అడ్డుకోవడం వంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని భరత్ రామ్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై నినదించే ప్రతిపక్ష హక్కును కాలరాస్తూ, 144 సెక్షన్‌ను రాజకీయ ఆయుధంగా ఉపయోగించడం దురదృష్టకరమని ఆయన అన్నారు. రాజమహేంద్రవరంలో ఇలా ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేయడం తగదని ఆయన అన్నారు.

**వారికి స్వేచ్ఛ.. మాపై నిర్బంధాలా?**

ఒకవైపు అధికార పార్టీకి చెందిన వ్యక్తులు బహిరంగంగా గుమికూడి ఉద్రిక్తతలు సృష్టిస్తున్నప్పటికీ, వారిపై చర్యలు తీసుకోకుండా ప్రతిపక్ష నాయకులనే లక్ష్యంగా చేసుకోవడం పోలీసు వ్యవస్థ తటస్థతపై అనుమానాలు కలిగిస్తోందని భరత్ విమర్శించారు. అక్కడ పరిస్థితులను అదుపు చేయాల్సిన పోలీసులు, అధికార పార్టీ నేతల సూచనల మేరకు వ్యవహరిస్తున్నారనే భావన ప్రజల్లో ఏర్పడుతోందన్నారు. ప్రతిపక్ష పార్టీల కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని ఆయన అన్నారు



**వైఫల్యాలను ప్రశ్నిస్తే నిర్బంధమా?**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, పెరిగిన ధరలు, నిరుద్యోగం, రైతు సమస్యలు, మహిళల భద్రత, సంక్షేమ పథకాల అమలులో లోపాలు వంటి అంశాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడమే తమ కార్యక్రమం ఉద్దేశమని భరత్ తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియకుండా చేయడానికే ఇటువంటి నిర్బంధ చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.

**పోలీసు శాఖ తటస్థంగా వ్యవహరించాలి**

పోలీసు శాఖ రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన బాధ్యత కలిగి ఉందని, అధికార పార్టీ రాజకీయ అవసరాలకు అనుగుణంగా కాకుండా చట్టబద్ధంగా పనిచేయాలని భరత్ రామ్ సూచించారు. ఎందుకంటే ప్రభుత్వాలు శాశ్వతం కావని, అధికారంలో ఉన్నవారు మారిపోతారని గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. ప్రస్తుతం అధికార ఒత్తిళ్లకు లోనై ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికారులు భవిష్యత్తులో ప్రజలకు, చట్టానికి సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదీ**

ప్రతిపక్ష స్వరాన్ని అణచివేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు ఎంతకాలం సాగవని, ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలని భరత్ రామ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులు పరిరక్షించబడేలా ప్రభుత్వం వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## సీతానగరం పిహెచ్సిలో ప్రధానమంత్రి స్వాత్య మాతృత్వ అభియాన్ కార్యక్రమం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్సీ వైద్యులు డాక్టర్ వి.భవాని, ఎం.శైలజా రాణి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి స్వాత్స మాతృత్వ అభియాన్ శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. శిబిరానికి వచ్చిన52 మంది గర్భిణీ స్త్రీలను పరీక్షించి వారికి అవసరమైన రక్త పరీక్షలు చేసి తగిన మందులు ఉచితంగా వారికి అందించారు. వీరు లో 12 మందిని హైరిస్క్ గర్భిణీలుగా గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ భవాని మాట్లాడుతూ ప్రధానమంత్రి స్వా త్య మాతృత్వ అభియాన్ ప్రోగ్రామును ప్రభుత్వం ప్రారంభించి నేటికీ పది సంవత్సరాలు విజయవంతంగా పూర్తయిందని, ప్రతి గర్భిణీ స్త్రీ క్రమం తప్పకుండా నెలకు ఒకసారి డాక్టర్ తో వైద్య పరీక్షలు చేయించుకోవాలని తగిన పౌష్టికాహారం తీసుకుంటూ మనసు ప్రశాంతంగా ఉంచుకొని విశ్రాంతి తీసుకోవాలని, వడదెబ్బకు గురికాకుండా చల్లని ప్రదేశంలో ఉండి ద్రవపదార్థాలు తరచుగా తీసుకోవాలని, తద్వారా తల్లి మరియు తల్లి కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ప్రతి గర్భిణీ తప్పకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే పురుడు పోసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వై.ఎస్ రాయుడు పి హెచ్ ఎన్ కే. ఆదిలక్ష్మి, జి.దైవకృప,సూపర్వైజర్ కే .సుధాకర్, స్టాఫ్నర్స్ కిరణ్మయి, ఎల్ టి శిల్ప, ఫార్మసిస్ట్ నగేష్, ఎం ఎల్ హెచ్ పి లు, ఆశ వర్కర్లు, ఐసిడిఎస్ కార్యకర్తలు, ఆసుపత్రి ఓపి సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు కొనసాగించాలి

**10న ఢిల్లీకి ఆస్క్ బృందం.. : చైర్మన్ గుబ్బల రాంబాబు విజ్ఞప్తి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తూ జస్టిస్ కేజీ బాలకృష్ణన్‌ను ఈనెల 10వ తేదీన కలిసి విజ్ఞప్తి చేసేందుకు అంబేద్కర్ సేవా కేంద్రం నుంచి ఒక బృందం వెళుతోందని ఆస్క్ చైర్మన్ గుబ్బల రాంబాబు వెల్లడించారు. స్థానిక లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ఆవరణలో ఉన్న ఆస్క్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడంతో పాటు వాస్తవ, సామాజిక సమానత్వం వచ్చేవరకు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కొనసాగించాలని డిమాండ్ చేసారు. ఇంకా దేశంలో కుల వివక్ష కొనసాగుతోందని అందువల్లనే ఎస్సీ, ఎస్టీలు విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. హిందువులు, సిక్కులు, బౌద్ధులలా దళిత క్రైస్తవులకు కూడా రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఏ మతంలో ఉన్నా కులం మారడం లేదని, కేవలం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇస్తామనే విధానాన్ని ఆస్క్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. 2007లో జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమీషన్ ఇచ్చిన నివేదికను అమలు చేయకుండా, కేంద్ర ప్రభుత్వం మళ్లీ జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమీషన్‌ను నియమించిందని, ఈ కమీషన్ ఉన్నట్టుగా ఎక్కడా ప్రాచుర్యం కల్పించలేదని, ఆ కమిటీలో ఆయనతో పాటు ఇద్దరు సభ్యులు ఉన్న విషయం కూడా చాలా మందికి తెలియకపోవడం విచారకరమన్నారు. దేశంలో కులాన్ని రద్దు చేసి రిజర్వేషన్లు తీసేస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు. జాతీయ అక్షరాస్యత సగటు కంటే ఎస్సీ, ఎస్టీలు చాలా వెనుకబడి ఉన్నారని, కుల వివక్షత వల్ల ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు కూడా అనేకం జరిగాయన్నారు. కులం అంతర్గత విషయమని దాని గురించి ఎవరూ మాట్లాడటానికి వీలు లేదన్నారు. దీనిపై ఆస్క్ ఆధ్వర్యంలో కార్యాచరణ చేపట్టడానికి సిద్ధమవుతున్నామని తెలిపారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను సవరణ చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీలు వాస్తవ సమానత్వం సాధించే వరకు రిజర్వేషన్లు కొనసాగించాలని కేజీ బాలకృష్ణన్ కమీషన్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీలకు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగ నియమకాలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు జనాభా దామాషా ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు పూర్వ వైభవం తెచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, న్యాయ వ్యవస్థలో ఎస్సీ, ఎస్టీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని వినతి పత్రం అందచేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలను రాజ్యసభ సభ్యులు, గవర్నర్లుగా నియమించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం నియమ నిబంధనలు కఠినంగా అమలు చేయాలని కోరతామన్నారు. 30 నుంచి 40 కోట్ల మంది ఉన్న ఎస్సీ, ఎస్టీలు తిరుగుబాటు బావుటా ఎగురవేస్తే పరిస్థితి చాలా దారుణంగా ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఆస్క్ కో కన్వీనర్, మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు ఉందుర్తి సుబ్బారావు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కులాలు, మతాల పేరుతో సమస్యలు సృష్టిస్తున్నారని, దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు వర్తించవని భయభ్రాంతులకు గురిచేస్తునాన్నరని ఆవేదన వ్యక్తం చేసారు. ఎన్నికల ముందు ఈ విషయాన్ని ఎందుకు మేనిఫెస్టోలో ప్రకటించలేదో చెప్పాలని డిమాండ్ చేసారు. దళితుల హక్కులు కాపాడతామని అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. దళిత క్రైస్తవుల పట్ల అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరికి స్పష్టం చేయాలని డిమాండ్ చేసారు. రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు మత కల్లోలాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నందున కూటమి పార్టీలు తమ విధానాలను వెల్లడించాలని డిమాండ్ చేసారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధిపై ప్రత్యక్ష వివక్ష ఇంకా కనిపిస్తోందన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్, ఆస్క్ కన్వీనర్ అజ్జరపు వాసు, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆస్క్ కన్వీనర్ ఐ.ఈ.కుమార్ ఇతర నాయకులు అల్లు జయరాజ్, లోకేష్, కన్నా, లోవరాజు, నవీన్, సజ్జు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రక్షాళనలో ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలి

**సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి - అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయాలి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమని, నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, తప్పులు, డూప్లికేట్ నమోదులు, చిరునామా మార్పులు, ఫోటో లోపాలు వంటి అంశాలను సరిచేసుకునేందుకు “సర్” ఒక మంచి అవకాశమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి కుటుంబ సభ్యులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ ఇన్‌ఛార్జుల కోసం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై హోటల్ జగదీశ్వరిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిటీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో సుమారు 68 శాతం పోలింగ్ నమోదైందని, కూటమికి లక్షా ఇరవై వేలకుపైగా ఓట్లు లభించాయని గుర్తుచేశారు. ఓటర్లకు మరింత చేరువగా ఉండి, కుటుంబాల వారీగా వివరాలను పరిశీలించి, అర్హులైన



ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. బూత్ స్థాయిలో ఉన్న కార్యకర్తలకు స్థానిక కుటుంబాలు, ఓటర్ల వివరాలు బాగా తెలిసి ఉంటాయని, అందువల్ల బిఎల్ఓలతో సమన్వయం చేసుకుని ఓటరు జాబితాలోని లోపాలను సరిదిద్దే పనిలో చురుకుగా పాల్గొనాలన్నారు. ముఖ్యంగా భార్యాభర్తలు, కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు ప్రాంతాల్లో నమోదైన సందర్భాలు, చిరునామా మార్పులు, ఫోటో లోపాలు, డూప్లికేట్ నమోదులు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే కొత్తగా ఓటు హక్కు పొందిన యువతను గుర్తించి, వారిని ఓటరు జాబితాలో నమోదు చేయించేందుకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు చేయించేందుకు కార్యకర్తలు ప్రజలకు సహకరించాలని సూచించారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు విడుదలయ్యే డ్రాఫ్ట్ ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా సరిచేసే బాధ్యత అందరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా పూర్తిగా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేలా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందించాలని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా చేపట్టనున్న ప్రజా చైతన్య కార్యక్రమాలపై కూడా ఆయన వివరించారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలను ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వివరించే కార్యక్రమాలను ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. కూటమి భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ ప్రతి వార్డులో ప్రజలకు చేరువ కావాలని పిలుపునిచ్చారు. కాగా సదస్సులో పాల్గొన్న ఇన్‌ఛార్జులు అడిగిన పలు సందేహాలకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు సమగ్రంగా సమాధానాలు ఇచ్చి, సర్ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన విధానం, ఓటరు జాబితా సవరణలపై వివరణ ఇచ్చారు. ఈ సదస్సులో కూటమి నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ ఇన్‌ఛార్జులు, అధికారులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు న్యాయం చేయాలి

**ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు చీకట్ల వెంకటేశ్వరావు డిమాండ్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం అత్యంత విషాదకరమని, ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు చీకట్ల వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యుల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని కోరారు. అలాగే గాయపడిన కార్మికులకు రూ.50 లక్షల పరిహారం చెల్లించి, పూర్తిస్థాయి వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఘటనపై న్యాయ విచారణ జరిపి నివేదికను ప్రజలకు వెల్లడించాలని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించడం ప్రభుత్వంతో పాటు యాజమాన్యాల బాధ్యత అని పేర్కొన్న ఆయన, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఐఎఫ్‌టియు నిరంతరం పోరాడుతుందని తెలిపారు.

## నాలుగు రాజ్యసభ ఎంపీ అభ్యర్థుల నామినేషన్లు సమక్రమమే

**రిటర్నింగ్ అధికారి వణితా రాణి**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజ్యసభ ఎంపి ఎన్నికలకు సంబంధించి నలుగురు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు సక్రమంగా ఉండడంతో వాటిని ఆమోదించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వణితా రాణి వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన కార్యక్రమం జరిగింది. రాజ్యసభ ఎంపి అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ తరుపున చింతకాయల విజయ్,బాష్యం రామకృష్ణ,సానా సతీష్, జనసేన పార్టీ తరపున లింగమనేని రమేష్‌లు దాఖలు చేసిన నామినేష్లను సమక్రమంగా ఉండడంతో పరిశీలన అనంతరం నలుగురు అభ్యర్దుల నామినేషన్లను ఆమోదించినట్లు ఆమె వెల్లడించారు. నాలుగు రాజ్యసభ స్థానాలకు నలుగురు అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికవుతారు. ఈ నామినేషన్ల పరిశీలనలో ఆయా అభ్యర్థుల తరుపున వారి ప్రతినిధులు పాల్గొన్నారు.



# దివ్యాంగ పిల్లలకు అండగా నిలవడం మనందరి బాధ్యత

**సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో ఉచిత సహాయక ఉపకరణాల పంపిణీ**

**ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లోని ప్రతిభను ప్రోత్సహించాలి : జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్యేక అవసరాలు గల పిల్లలను, దివ్యాంగ పిల్లలను సమాజంలో సమానత్వంతో ఆదరించి, వారి ఎదుగుదలకు అండగా నిలవడం మనందరి కనీస బాధ్యత అని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పేర్కొన్నారు. సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులైన విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కోనసీమ జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ద్వారా 6 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలబాలికలకు అలిమ్కో సంస్థ సమకూర్చిన 396 ఉపకరణాల పంపిణీని ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలిన ఉపకరణాలను సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల్లో శాసనసభ్యుల చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. శారీరక లేదా మానసిక లోపాలు ఉన్నంత మాత్రాన పిల్లలు జీవితంలో వెనుకబడిపోరని, వారికి సరైన ప్రోత్సాహం, అవకాశాలు, అవసరమైన సాధనాలు అందిస్తే అద్భుతాలు సృష్టించగలరని ఆయన అన్నారు. వైకల్యం అనేది శరీరానికే పరిమితమని, వారి మేధస్సుకు కాదని పేర్కొన్నారు. ప్రతి పిల్లలోనూ ప్రత్యేక ప్రతిభ, సృజనాత్మకత దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా దివ్యాంగ విద్యార్థుల విద్యాభ్యాసానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. అందులో భాగంగానే వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు (హియరింగ్ ఎయిడ్స్), క్రచెస్, బ్రెయిల్ కిట్లు తదితర ఉపకరణాలను పూర్తిగా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఉపకరణాలు పిల్లల దైనందిన జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించి, ఇతరులపై ఆధారపడకుండా ఆత్మవిశ్వాసంతో పాఠశాలలకు వెళ్లేందుకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, సంరక్షకులు, ఐఈఆర్టీలు పాఠశాల వయస్సు గల ప్రతి దివ్యాంగ బాలబాలికను గుర్తించి, వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులు కూడా అధైర్యపడకుండా తమ పిల్లలను పాఠశాలలకు పంపించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మీ, ఐఈసీ సభ్యులు ఎం.బి.బి. సత్యనారాయణ, ఏపీవో ఎం.ఏ.కే. భీమారావు, సిబ్బంది పాల్గొన్నారు.

**మాధవరపు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో**

## గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



**దంగేరు, విశ్వం వాయిస్ న్యూస్ :** దంగేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాధవరపు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈరోజు 30 మంది గర్భిణీ స్త్రీలకు పాలు, గ్రుడ్లు పంపిణీ చేశారు. పేదలకు సహాయం చేయాలనే సదుద్దేశంతో ట్రస్ట్ నిర్వాహకులు ఈ పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ 'మానవసేవే మాధవసేవ' అని నమ్మిన డీపీఎంవో వారి కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాల్లో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు మాధవరపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సమాజంలోని పేదల పట్ల దయ చూపుతూ, మనకున్న దాంట్లో కొంత సహాయం చేయాలనే స్ఫూర్తితోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేలా ఆ భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. గర్భిణులంతా మంచి పోషకాహారం తీసుకుంటూ వైద్యుల సలహాల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడి ఆరోగ్యవంతులైన భావితరాలకు జన్మనివ్వాలని మరో ట్రస్ట్ సభ్యురాలు మాధవరపు భవాని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో, ఎన్.ఎల్.ఈ.పి నోడల్ పర్సన్ శ్రీమన్నారాయణ, హెచ్.వి, స్టాఫ్ నర్స్, కనకాల వీరభద్రరావుతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమలాపురంలో విజయవంతమైన రాస్తారోకో

**ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాల సమరభేరి**




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నిరంతరం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలకు నిరసనగా, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ సీపీఐ(ఎం), సీపీఐ, ఇతర వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అమలాపురం పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్ వద్ద రాస్తారోకో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్తిబాబు, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ ఆ ప్రయోజనం సామాన్య ప్రజలకు అందకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధనాలపై భారీ పన్నులు విధిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం లీటర్ ఇంధనంపై సుమారు రూ.20, రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.35 వరకు పన్నులు విధిస్తూ ప్రజలపై అదనపు భారం మోపుతోందని ఆరోపించారు. గత 12 సంవత్సరాల్లో చమురు అమ్మకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.65 లక్షల 56 వేల కోట్ల మేర ఆదాయం పొందిందని, ఆ మొత్తాన్ని కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వినియోగించిందని విమర్శించారు. కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న చమురు, గ్యాస్ వనరులలో చట్టబద్ధంగా 50 శాతం వాటా ఆంధ్రప్రదేశ్‌కు దక్కాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి చెందిన సహజ వనరులను ఇతర ప్రాంతాలకు తరలించడం వల్ల స్థానిక ప్రజలకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను కోనసీమ జిల్లా అవసరాలకు వినియోగించాలని, రాజకీయ లేదా అధికార జోక్యం లేకుండా జిల్లా సమగ్ర అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. పొదుపు పేరుతో సంక్షేమ పథకాలు, ఉపాధి హామీ పథకాలకు నిధులు తగ్గించడం, రైతులకు అందిస్తున్న ఎరువులు, విత్తనాల సబ్సిడీలను తగ్గించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని వామపక్ష నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు వాసంశెట్టి సత్తిరాజు, ఎన్.బలరాం, పీతల రామచంద్రరావు, వెంకటేష్, పి.శివ, చెల్లుబోయిన తాతారావు, వై.చిట్టిబాబు, పెద్దిరెడ్డి రాము, శీలం వెంకటేష్, జి.దుర్గాప్రసాద్, సఖిలే సూర్యనారాయణ, ఇసుకపట్ల మంగాదేవి, బుంగ సత్యనారాయణ, సతీష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

**బీజేవైఎం కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శిగా**

## తోలేటి సూర్య గంగాధర్ నియామకం



**రామచంద్రాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా యువ మోర్చా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామచంద్రాపురానికి చెందిన ప్రముఖ యువ నాయకుడు సామాజిక కార్యకర్త తోలేటి సూర్య గంగాధర్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ, యువ మోర్చా ఉన్నతాధికార యంత్రాంగం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. గత కొంతకాలంగా పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తూ యువతను రాజకీయాల వైపు నడిపించడంలో ఆయన చేసిన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం సూర్య గంగాధర్‌కు ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా నూతన జిల్లా ప్రధాన కార్యదర్శి తోలేటి సూర్య గంగాధర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన బీజేపీ, యువ మోర్చా రాష్ట్ర మరియు జిల్లా పెద్దలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో యువమోర్చాను మరింత బలోపేతం చేసి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. తోలేటి సూర్య గంగాధర్ నియామకం పట్ల రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ శ్రేణులు, యువ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

**రొయ్యల రైతుల సంక్షేమం, ఆక్వాకల్చర్ రంగాభివృద్ధికి**

## ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**




**అమరావతి/ విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఆక్వాకల్చర్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో రొయ్యల రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, సముద్ర ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు తదితర రంగ ప్రతినిధులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రొయ్యల ఫీడ్ ధరల పెరుగుదలపై రైతులు, పరిశ్రమ వర్గాలు తమ అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చాయని మంత్రి తెలిపారు. ఫిష్‌మీల్, సోయాబీన్ తదితర ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఉత్పత్తి వ్యయాలు అధికమయ్యాయని తయారీ సంస్థలు వివరించగా, ఇప్పటికే ఖర్చుల భారం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపును నియంత్రించాలని రైతులు కోరినట్లు చెప్పారు. ఆక్వాకల్చర్ రంగ సమగ్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, తయారీదారులు చర్చల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారానికి రావాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు. ఆక్వాకల్చర్ రైతులకు విద్యుత్ రాయితీపై మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి అదనంగా 12 వేల ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున రాయితీ అందించే ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. ఉత్తర్వులు జారీ అయిన తర్వాత అర్హత కలిగిన అన్ని ఆక్వాకల్చర్ కనెక్షన్లు అవి చిన్న, పెద్ద ఫారాలు అయినా, ఆక్వా జోన్ లేదా నాన్-ఆక్వా జోన్‌లో ఉన్నా ఈ పథకం పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కైకలూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాస్, ఏపీఎస్ఏడీఏ కో-వైస్ ఛైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి, మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, కేంద్ర మత్స్యరంగ సంస్థల ప్రతినిధులు, పరిశ్రమ సంఘాల నాయకులు, రొయ్యల రైతులు, ఫీడ్ తయారీదారులు, సముద్ర ఆహార ఎగుమతిదారులు పాల్గొన్నారు.

**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై**

## అవగాహన పెంచుకోవాలి

**ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యత కలిగినదని, ప్రతి నాయకుడు, కార్యకర్త పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరిని నమోదు చేయడంతో పాటు, ఫారం-2ను సక్రమంగా పూర్తి చేసి సమర్పించేలా చూడాలని కోరారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా బీఎల్ఏలు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జులు, కో-ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, యూనిట్ కో-ఇన్‌చార్జులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

**ఓటర్ల జాబితా సవరణలో**

## ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని సమష్టి కృషితో విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ద్రాక్షారామం మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదు చేయడం అదేవిధంగా అనర్హుల పేర్లను తొలగించడం వంటి కీలక అంశాలు ఈ ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారానే సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి బాధ్యులు చురుగ్గా పాల్గొని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, పెంకే సాంబశివరావు, టేకుమూడి సత్యనారాయణ, వయిట్ల గజ లక్ష్మి, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పలివెల ప్రకాష్, చిల్లా గోపాలకృష్ణ, ఆకుల నారాయణరావు, బొమ్ము బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు యూనిట్ కమిటీలు, బూత్ కమిటీలు, గ్రామ కమిటీ సభ్యులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సంకల్పించారు.

## రామచంద్రపురం రైతు బజార్‌లో దళారుల దోపిడీ



**అధికారుల తీరుపై మేడిశెట్టి ఇశ్రాయేల్ ధ్వజం**

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక రైతు బజార్‌లో కాయగూరల ధరల పట్టిక (ప్రైస్ బోర్డు) ఖాళీగా దర్శనమిస్తుండటంతో సామాన్యుల జేబులకు చిల్లులు పడుతున్నాయని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ మేడిశెట్టి ఇశ్రాయేల్ ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఆసరాగా చేసుకుని దళారులు సామాన్యులను నిలువునా దోచుకుంటున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారులు ప్రతిరోజూ నిర్ణయించిన కూరగాయల ధరలను బోర్డుపై రాయకపోవడంతో ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకుని నిజమైన రైతులకు బదులుగా వ్యాపారులు, దళారులు రైతుల ముసుగులో రైతు బజార్‌లోకి ప్రవేశిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ధరల పట్టికలో రేట్లు లేకపోవడంతో వీరు ఇష్టానుసారంగా ధరలు పెంచి విక్రయిస్తున్నారని ప్రశ్నించే వారు లేకపోవడంతో వినియోగదారులు వారు అడిగినంత చెల్లించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళారీ వ్యవస్థను నిర్మూలించి రైతులకు, వినియోగదారులకు నేరుగా మేలు చేకూర్చాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యానికి పూర్తి భిన్నంగా ఇక్కడి పరిస్థితి తయారైందని, రైతు బజార్ దళారులకు అడ్డాగా మారిందని విమర్శించారు. సంబంధిత ఎస్టేట్ ఆఫీసర్ మార్కెటింగ్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ప్రతిరోజూ ఉదయాన్నే కాయగూరల ధరలను పట్టికలో స్పష్టంగా రాయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల ముసుగులో కూరగాయలు విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న దళారులను తక్షణమే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి గుర్తింపు కార్డులను రద్దు చేయాలన్నారు. అధికారులు ప్రతిరోజూ రైతు బజార్‌ను తనిఖీ చేసి నిర్ణీత ధరలకే కూరగాయలు విక్రయించేలా పర్యవేక్షణ పెంచాలని జరుగుతున్న ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసి సామాన్య ప్రజలకు, నిజమైన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆయన కోరారు.

**అమలాపురంలో ఘనంగా ప్రారంభమైన**

## "స్వచ్ఛ రథం" కార్యక్రమం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ రథం" (మొబైల్ వ్యర్థాల సేకరణ వాహనం) కార్యక్రమాన్ని అమలాపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. రిబ్బన్ కత్తిరించి స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన అనంతరం వాహనాన్ని పరిశీలించి కార్యక్రమం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలను చేపడుతోందని పేర్కొన్నారు. మండలానికి ఒకటి చొప్పున కేటాయించిన స్వచ్ఛ రథం ప్రతి రోజు ఒక గ్రామాన్ని సందర్శించి, ఇళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను సేకరిస్తుందని తెలిపారు. పాత ఇనుము, ప్లాస్టిక్ బాటిళ్లు, పేపర్లు, స్టీల్, అల్యూమినియం వంటి పునర్వినియోగానికి అనువైన వస్తువులను ప్రజలు స్వచ్ఛ రథానికి అందజేయవచ్చని చెప్పారు. సేకరించిన వస్తువులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం నగదు లేదా సమాన విలువ గల వస్తువులు అందజేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చెత్త పేరుకుపోవడం తగ్గడంతో పాటు పరిసరాల పరిశుభ్రత మెరుగుపడుతుందని, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు దోహదపడుతుందని అన్నారు. ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, గ్రామాలను స్వచ్ఛంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ తమ ఇళ్లలో ఉపయోగం లేని వ్యర్థ పదార్థాలను బయట పారవేయకుండా స్వచ్ఛ రథానికి అందజేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న పరిశుభ్రత కార్యక్రమాలను విజయవంతం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పిల్లల్లో తొలి ఆరు సంవత్సరాలూ చాలా కీలకం...!

## ఐసిడిఎస్ స్టేట్ రిసోర్స్ పర్సన్ వివి.అరుణశ్రీ - 6 ఏళ్ళ పిల్లల సమగ్ర అభివృద్ధికి శిక్షణా కార్యక్రమం - విజయవంతమైన రౌతులపూడి, శంఖవరం శిక్షణలు





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పిల్లల జీవితాల్లోని తొలి ఆరు సంవత్సరాల కాలం వారి శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ అభివృద్ధికి అత్యంత కీలకమైన కాలమని నిపుణులు కనుగొన్నారని ఐసిడిఎస్. స్టేట్ రిసోర్స్ పర్సన్ వివి.అరుణశ్రీ వెల్లడించారు. ఈ దశలో పిల్లల అభివృద్ధి లోపాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం ద్వారా వారి భవిష్యత్తును మరింత మెరుగ్గా తీర్చి దిద్దొచ్చని ఆమె తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 0-6 సంవత్సరాల పిల్లల కోసం "నవచేతన" పేరుతో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత బాల్యారంభ అభివృద్ధి (ఎర్లీ చైల్డ్ హుడ్ డెవల్‌ప్మెంట్ - ఈసీడీ) స్క్రీనింగ్‌పై కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరం జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మండలంలోని 57 మంది అంగన్వాడీ కార్యకర్తలకూ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శంఖవరం, రౌతులపూడి మండలాలకు సంబంధించిన శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపీఓ. పర్వత వెంకటలక్ష్మి సారధ్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో అరుణశ్రీ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. చిన్నారుల ఎదుగుదల, అభివృద్ధి దశలు, వయస్సుకు అనుగుణమైన అభివృద్ధి మైలురాళ్ళు, అభివృద్ధి ఆలస్యాలను గుర్తించాలని ఆమె పేర్కొన్నారు. తల్లి దండ్రులకు పిల్లల అభివృద్ధి, పోషక ఆహారం, ఆరోగ్యం సంరక్షణపై అవగాహన కల్పించడంలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర ఎంతో ప్రాముఖ్య మైనదని ఆమె వివరించారు. ఈ శిక్షణ ద్వారా పిల్లలలో అభివృద్ధి సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన సేవలకు అనుసంధానం చేయడంలో సిబ్బంది సామర్థ్యాలు మరింత బలోపేతం అవుతాయని అరుణశ్రీ పేర్కొన్నారు. 0-6 ఏళ్ళ లోపు వయస్సు పిల్లల్లో తరచుగా సంభవించే 4 డి లైన పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, లోపాలు, అభివృద్ధిలో జాప్యం, వైకల్యాలు వంటి ప్రధాన 4 రకాల సమస్యలను గుర్తించాలని శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు బిట్రా దేవ్య ఆషికా నిర్దేశించారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద భారత ప్రభుత్వం పిల్లల కోసం ప్రవేశ పెట్టిన ముఖ్య ఆరోగ్య కార్యక్రమమైన రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం పథకం గురించి దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా ఆమె శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మరో ముఖ్య వక్తగా ప్రసంగించారు. 4 డిలను అధిగమించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అంశాల వారీగా దేవ్య ఆషికా సమగ్రంగా వివరించి అవగాహన కల్పించారు. పిల్లలతో మొదటి పరిచయస్తులు, ప్రాథమిక సంరక్షకులుగా ఉండేది తల్లిదండ్రులు, అమ్మమ్మలు, నాయనమ్మలు, కుటుంబ సభ్యులే కాబట్టి వారే పిల్లల్లోని సాధారణ స్థితికి విరుద్ధమైన (అబ్ నార్మలిటీస్) అసాధారణ, సహజంగా ఉండాల్సిన పద్ధతికి, ఆకృతికి, ఆరోగ్యానికి భిన్నంగా ఉండే పరిస్థితులను, ప్రాథమిక రోగ లక్షణాలను తొలుత గుర్తించాలని నిర్దేశించారు. అలా గుర్తించేలా కుటుంబ సభ్యులకు తగు అవగాహనను కల్పించాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. అవసరమైన సందర్భాల్లో రిఫరల్ సేవలపై శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు బిట్రా దేవ్య ఆషికా అవగాహన కల్పించారు. రౌతులపూడి ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్ వి.నాగమణి మాట్లాడుతూ "నవచేతన" కార్యాచరణ ప్రణాళిక అంశాలు అన్నీ పాఠ్యపుస్తకం రూపంలో ఉండేవని అన్నారు. అయితే ఈ నవచేతన పథకం మొత్తాన్ని అంతర్జాల ఆధారిత అనువర్తనంలోకి అభివృద్ధి పరిచారని ఆమె పేర్కొన్నారు. బాల్యాభివృద్ధి, స్క్రీనింగ్ అంశాలు, విషయాలు అన్నింటినీ ఇకపై ఎప్పటి కప్పుడుశఈ అనువర్తనంలో పారదర్శకంగా అంగన్వాడీ కార్యకర్తలు విధిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. శంఖవరం మండలం సెక్టార్ సూపర్వైజర్ బి.వెంకటరజని మాట్లాడుతూ భారత ప్రభుత్వ మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రవేశ పెట్టిన 'నవచేతన' ముఖ్య ఉద్దేశ్యం (థీమ్) ను సమగ్రంగా వివరించారు. ఈ పథకం సమగ్ర అమలులో అంగన్వాడీ కార్యకర్తలకు ఇప్పటికే ప్రభుత్వం అందించిన ఆధార్ శిల, నవచేతన పాఠ్య పుస్తకాలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలని వెంకట రజని కోరారు. సిడిపీఓ. పర్వత వెంకటలక్ష్మి మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి 6 సంవత్సరాల వయస్సు వరకు ఉన్న పిల్లల సమగ్ర వికాసంపై నవచేతన పథకం దృష్టి పెడుతుందని వివరిస్తూ శిక్షణా కార్యక్రమ విషయాలను పంచుకున్నారు. ఆయా అంశాలను రేఖా మాత్రంగా శిక్షణార్థులకు పరిచయం చేశారు. మొత్తం కార్యక్రమాన్ని ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆసాంతం పర్యవేక్షించారు. తొలి రోజు సోమవారం నాటి రౌతులపూడి శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. మలి రోజు మంగళవారం శిక్షణా కార్యక్రమం కూడా విజయవంతం కాగా శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సి.హెచ్.ఓ. మేరీమణి, ఎం.ఎల్.హెచ్.పి. రత్నశ్రీ, సీనియర్ ఏ.ఎన్.ఎం. ఉందుర్తి గ్లోరీ పాల్గొన్నారు.



### సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చేస్తున్న

# అభివృద్ధి ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### తణుకు నియోజకవర్గ పరిశీలకులు నక్కా చిట్టిబాబు



**తణుకు, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళవారం ఉద యం తణుకు పట్టణం స్థానిక వీ.కే ఫంక్షన్ హాల్‌లో తణుకు శాసన సభ్యులు అరుమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఎస్ఐఆర్‌పై నియోజకవర్గ స్థాయి శిక్షణ తరగతులు కార్య క్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తణుకు నియోజకవర్గ పరిశీలకులు నక్కా చిట్టిబాబు అతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా చిట్టి బాబు మాట్లాడుతూ, ఎస్ ఐ ఆర్ పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన చేసుకొని క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరు పని చేయాలని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో వార్డు మెంబర్ మొదలుకొని ఎంపీటీసీ జడ్పీటీసీ కౌన్సిలర్లుగా అవకాశం పొందాలి అన్నా ఈ ఎస్ ఐ ఆర్ మీద అవగాహన పొంది మనకు సంప్రదాయంగా వస్తున్న ఓటర్లు లిస్ట్ లో ఉండేలా చేయాలి అని, బి ఎల్ఎలు ఎప్పటికప్పుడు బిఎల్ఓలతో సమన్వయం చేసుకొంటూ,ఈ క్రమంలో సమస్యలు ఏమైనా ఉంటే క్లస్టర్ ఇంచార్జు ద్వారా శాసనసభ్యులకు తెలియజేయాలి అని అన్నారు. అలాగే ఈ రెండు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు మరియు నియోజకవర్గం లో ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనుల గురించి క్షేత్ర స్థాయిలోకి వెళ్ళిన ప్రతిసారి ప్రజలకు తెలియజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,క్లస్టర్ ఇంచార్జు యూనిట్ ఇంచార్జు బూత్ ఇంచార్జు పాల్గొన్నారు.

### కూటమి సుపరిపాలనకు

# ప్రతీకగా నిలుస్తున్న ప్రజా వేదిక

**రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుదుపూడి సత్తిబాబు**

**సీఎం చంద్రబాబు ప్రజా పాలనకు ప్రజా వేదిక నిదర్శనం**

**ప్రజా వేదికలో అర్జీలు స్వీకరించిన మంత్రి నారాయణ, కుదుపూడి సత్తిబాబు**



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా వేదిక" కార్యక్రమంలో మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణతో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుదుపూడి సత్తిబాబు పాల్గొని ప్రజల సమస్యలను వినడం, వాటిని వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం ప్రజా వేదిక ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువ కావాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు నిర్వహిస్తున్న ప్రజా వేదిక కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన పొందుతోందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లే అవకాశం కల్పించడం, సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయడం, ప్రజలతో ప్రభుత్వానికి ప్రత్యక్ష అనుసంధానం కల్పించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనకు అత్యధిక ప్రాధాన్యత లభిస్తోందన్నారు. ప్రజల అవసరాలను అర్థం చేసుకుని వాటికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం, సమస్యల పరిష్కారానికి సాంకేతికతను వినియోగించడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకతగా నిలిచిందని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనే మూడు లక్ష్యాలతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రతి అర్జీ వెనుక ఉన్న ప్రజల సమస్యను అర్థం చేసుకుని పరిష్కారం చూపాలనే దృక్పథంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రజా వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రతి వినతిపత్రాన్ని సంబంధిత శాఖలకు పంపించి, నిర్దిష్ట గడువులో పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ, వారి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా వేదిక కార్యక్రమం ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. ప్రజల కోసం, ప్రజలతో కలిసి పనిచేసే ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం కొనసాగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# పేరుకు ఉక్కు... భద్రత మాత్రం తుక్కు

విశాఖ స్టీల్ ప్లాంట్ దేశంలోనే తీర ప్రాంత ప్లాంట్ గా ఘనత దక్కించుకుంది. అంతే కాదు దేశంలో ఎక్కడా లేని విధంగా నాణ్యమైన స్టీల్ ఉత్పత్తి ఇక్కడ నుంచి జరుగుతుంది. విశాఖ స్టీల్ ఎగుమతులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. ఇన్ని ఉండి కూడా అల్లుడి నోట్లో శని ఉన్నట్లుగా విశాఖ స్టీల్ ప్లాంట్ కి ఎన్నో సమస్యలు సవాళ్ళు ఉన్నాయి. ఇప్పటికి మూడున్నర దశాబ్దాలుగా ఆపరేషన్స్ స్టార్ట్ చేసి ముందుకు సాగుతున్న విశాఖ స్టీల్ ప్లాంట్ కి ఈ రోజుకీ సొంత గనులు లేవు. దాంతో లాభాలు ఎన్ని గడిస్తున్నా గనుల కొనుగోలు వల్ల నష్టాలలోకి పోతోంది. సొంత గనులను చూపించకుండా దేశంలో నిర్వహిస్తున్న ఏకైక ప్లాంట్ గా కూడా దీనిని చూడాల్సి ఉందని అంటారు.



**ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా :** విశాఖ స్టీల్ ప్లాంట్ ని 1970 ప్రాంతంలో ఎన్నో ఉద్యమాల తరువాత అప్పటి కేంద్ర ప్రభుత్వం విశాఖలో ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రకటించింది. శ్రీమతి ఇందిరాగాంధీ పార్లమెంట్ లో దీని మీద ప్రకటన చేశారు. అది జరిగిన తరువాత పాకిస్తాన్ తో భారత్ యుద్ధం, ఆ తరువాత దేశంలో ఎమర్జెన్సీ వంటి పరిస్థితులతో ఇందిరాగాంధీ రెండవ టెర్మ్ పూర్తి అయింది. మధ్యలో 1977 నుంచి 1980ల దాకా జనతా ప్రభుత్వం వచ్చింది. అయితే 1980లో మూడవసారి ఇందిరాగాంధీ అధికారంలోకి వచ్చాక విశాఖ స్టీల్ ప్లాంట్ కి మాట ఇచ్చిన ప్రకారం శంకుస్థాపన చేశారు. అలా రష్యా సాంకేతిక సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్ లో నిర్మాణం మొదలైన ఈ ప్లాంట్ 1991కి ఆపరేషన్స్ ని స్టార్ట్ చేసింది. 1992లో విశాఖలో పర్యటించిన అప్పటి ప్రధాని పీవీ నర సింహారావు స్టీల్ ప్లాంట్ లో ఆపరేషన్స్ ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అయితే అయితే సొంత గనులు ఎక్కడ నుంచి వస్తాయి ఎలా కేటాయించాలి అన్నది ఆనాడు ఎవరూ చూడలేదు.

**అస్థిర ప్రభుత్వాలతో :** ఇక పీవీ కేంద్రంలో మైనారిటీ ప్రభుత్వాన్ని అయిదేళ్ళ పాటు నడిపారు. ఆ తరువాత 1996 నుంచి 1999 దాకా సంకీర్ణ ప్రభుత్వాలు వరస ఎన్నికలు జరిగి అస్థిరత్వం రాజ్యమేలింది. 1999లో వాజ్ పేయ్ 23 పార్టీలతో కూడగట్టి ఎన్డీయే ప్రభుత్వాని ఏర్పాటు చేశారు. వాజ్ పేయ్ ఏలుబడిలోనే తొలిసారి తీవ్ర నష్టాలతో స్టీల్ ప్లాంట్ మునిగింది. ఆ సమయంలో స్టీల్ ప్లాంట్ ని వాజ్ పేయి ప్రభుత్వం ఆర్థిక భారం నుంచి ఆదుకుంది. కానీ అసలైన రోగానికి మందు వేయలేకపోయింది. అదే సొంత గనులు కేటాయించడం. ఆ తరువాత వచ్చి పదేళ్ళ పాటు అధికారంలో ఉన్న కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కూడా సొంత గనులను కేటాయించలేదు. 2014 నుంచి నేటి వరకూ గత పన్నెండేళ్ళుగా కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కూడా సొంత గనుల విషయంలో ఏమీ చేయలేదు అన్న విమర్శలను కార్మిక సంఘాల నేతలు చేస్తారు.

**ప్రైవేటీకరణ దిశగా :** గతంలో పెద్దగా వినిపించని ప్రైవేటీకరణ చర్చలు మాటలు గత పుష్కర కాలంగా ఎక్కువగా వినిపిస్తూ వచ్చాయి. దానికి మరో కారణం స్టీల్ ప్లాంట్ లో పూర్తి స్థాయిలో పెట్టుబడులు ఉప సంహరించుకోవాలని కేంద్రం ఆలోచిస్తోంది అన్నది కూడా ప్రచారంలో ఉండడం. అంతే తప్ప నష్టాలు సొంత గనులు లేని కారణంగా వస్తున్నాయని గుర్తించడం లేదని కార్మిక వర్గాల ఆవేదనగా ఉంది. మొదటి నుంచి స్టీల్ ప్లాంట్ విషయంలో వివక్ష అయితే కొనసాగుతోందని కార్మిక లోకం ఆరోపిస్తుంది.

**భద్రతా లోపాలు :** దానికి తోడు అన్నట్లుగా స్టీల్ ప్లాంట్ లో ఆర్థిక భరాన్ని తగ్గించుకునేందుకు పర్మనెంట్ సిబ్బందిని తగ్గిస్తున్నారు. అలాగే కాంట్రాక్ట్ సిబ్బందిని వేలాదిగా ఇంటి బాట పట్టించారు. ఇక నిపుణుల కొరత అయితే అధికంగా ఉంది. స్టీల్ ప్లాంట్ లో అత్యంత కీలకమైన విభాగంగా హాట్ మెటల్ వింగ్ ఉంటుంది. ఇక్కడ వందల వేల అత్యధిక ఉష్ణోగ్రతల మధ్యన ఉక్కుని కరిగిస్తారు. సేఫ్టీ ఆడిట్ తో పాటు సేఫ్టీ ప్రోటోకాల్ ఇక్కడ అత్యవసరం. అందువల్ల నిపుణులు అయిన వారు పర్మనెంట్ సిబ్బంది కూడా ఉండాలి. కానీ ఇంటర్నల్ గా బదిలీలు చేస్తున్నారు. తక్కువ స్టాఫ్ తో ఎక్కువ ఉత్పత్తి అన్న విధానం తెచ్చారని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. దాంతో ఉండాల్సిన నిపుణులు లేకనే పెను ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికుల భద్రత గాలిలో దీపంగా మారుతోందని అంటున్నారు.

**ఈ ప్రమాదం ఏమి చెబుతోంది :** ఇదిఉలా ఉండగా తాజాగా చూస్తే హాట్ మెటల్ కాస్టింగ్ విభాగంలో ఒక భారీ ప్రమాదం జరిగింది. సుమారు 1,500 డిగ్రీల సెల్సియస్ నుండి 1,600 డిగ్రీల సెల్సియస్ వరకు అత్యధిక ఉష్ణోగ్రత గల కరిగిన ఉక్కును తీసుకువెళ్తున్న ఒక లాడర్ సరిగ్గా పనిచేయక పేలిపోయింది. స్టీల్ మెల్టింగ్ షాప్ ఒకటి, అలాగే రెండు కంటిన్యూయస్ కాస్టింగ్ డిపార్ట్‌మెంట్ విభాగాలలో సాధారణ కాస్టింగ్ కార్యకలాపాలు జరుగుతున్న సమయంలో ఈ భారీ పేలుడు సంభవించింది. దానికి కారణం సరైన భద్రతా ప్రమాణాలు లేవని అంటున్నారు. వీటి విషయంలో పట్టించుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. కార్మికుల సంఖ్యను తగ్గించడం ఆరు వేల మంది కాంట్రాక్టు కార్మికులను ఇంటికి పంపడం మరో 1600 మంది శాశ్వత సిబ్బందిని వీఆర్ఎస్ పేరుతో తొలగించారు అని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**శాశ్వతమైన చర్యలను చేపడితేనే :** భద్రతా ప్రమాణాలు సరిగ్గా లేవని చాలా సార్లు కార్మిక సంఘాలు పాలకులకు చెబుతున్నా పట్టించుకోలేదు అన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఈ రోజుకీ హాట్ మెటల్ కాస్టింగ్ విభాగంలో పనిచేయడం ఒక సవాల్ గా మారిన నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం అక్కడ పరిస్థితులు చెప్పాలీ అంటే భద్రత అన్నది గాలిలో దీపంగానే ఉంది అని అంటున్నారు. ప్రమాదం జరిగింది అని పరిహారంతో కాకుండా శాశ్వతమైన చర్యలను చేపడితేనే స్టీల్ ప్లాంట్ లో మళ్ళీ ఎలాంటి దుర్ఘటనలు జరగవని అంటున్నారు.

### గోదావరి పుష్కరాలు-2027కు

# వినూత్న పర్యాటక ప్రణాళికలు రూపొందించాలి

## టూర్ అండ్ ట్రావెల్స్, టూరిజం ప్రతినిధులతో కలెక్టర్ కీర్తి చేకూరి సమీక్ష

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి పుష్కరాలు - 2027 సందర్భంగా జిల్లాకు వచ్చే యాత్రికులు, పర్యాటకులకు మెరుగైన అనుభూతిని అందించేందుకు సమగ్ర పర్యాటక ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. మంగళవారం బొమ్మూరు కలెక్టరేట్‌లో టూర్ అండ్ ట్రావెల్స్, టూరిజం, క్యాబ్ అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పుష్కరాల నేపథ్యంలో పర్యాటక అభివృద్ధి అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లాలో ప్రస్తుతం పర్యాటకుల ప్రయాణ ధోరణి ఎలా ఉందో, ప్రజలు వ్యక్తిగత కార్లను ఎక్కువగావినియోగిస్తున్నారా లేదా ఇతర రవాణా సౌకర్యాలను ప్రాధాన్యత ఇస్తున్నారా, ఏయే సీజన్లలో పర్యాటక రద్దీ అధికంగా ఉంటుందో, ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ఎంతమంది ఇతర ప్రాంతాలకు పర్యాటక ప్రయాణాలు చేస్తున్నారో, వారు ఎక్కువగాసందర్శిస్తున్న ప్రాంతాలేమిటో వివరాలను అడిగి తెలుసుకున్నారు. పుష్కరాల సందర్భంగా జిల్లాలో



రూపొందించిన పర్యాటక ప్యాకేజీలు వాస్తవ పరిస్థితులకు ఎంత మేరకు అనుగుణంగా ఉన్నాయో ప్రతినిధుల అభిప్రాయాలను కోరారు. ఎక్కువ మంది పర్యాటకులు జిల్లాలోని వివిధ ప్రాంతాలను సందర్శించేలా ఎలాంటి ప్యాకేజీలను రూపొందిస్తే ప్రయోజనకరంగా ఉంటుందో సూచనలు ఇవ్వాలని, వాటిని అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ విషయంలో టూర్ అండ్ ట్రావెల్స్ సంస్థలతో భాగస్వామ్యంగా పనిచేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రాజమహేంద్రవరం కేంద్రంగా మారేడుమిల్లి, పాపికొండలు, దిండి, పంచారామ క్షేత్రాలు, ఇతర ప్రముఖదేవాలయాలు, ప్రకృతి అందాల ప్రాంతాలను అనుసంధానిస్తూ కొత్త టూరిస్ట్ సర్క్యూట్ల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అలాగే సంప్రదాయ గోదావరి వంటకాలతో కూడిన ప్రత్యేక ఆహార అనుభవాలు, స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసే "ఎక్స్‌పీరియన్స్ టూరిజం"ను ప్రోత్సహించేందుకు అవసరమైన సూచనలు ఇవ్వాలని ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా క్యాబ్ అసోసియేషన్ ప్రతినిధులు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, జాతీయ రహదారుల వద్ద జిల్లాలోని ప్రధాన పర్యాటక ప్రదేశాల సమాచారంతో కూడిన సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. అలాగే గోదావరి జిల్లాల పర్యాటక విశిష్టతలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు ప్రత్యేకంగా ఒక "టూరిజం అంబాసిడర్"ను నియమించాలని టూరిజం, ట్రావెల్స్ ప్రతినిధులు ప్రతిపాదించారు. పుష్కరాల సందర్భంగా పర్యాటక రంగ అభివృద్ధికి వినూత్న ఆలోచనలు, కార్యాచరణ ప్రణాళికలతో ఒక వారం రోజుల్లో ముందుకు రావాలని కలెక్టర్ ప్రతినిధులకు సూచించారు.

ప్రభుత్వం, పర్యాటక రంగ భాగస్వాములు, స్థానిక సంస్థల సమన్వయంతో పుష్కరాలను ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక పరంగా దేశవ్యాప్తంగా ఆదర్శవంతమైన ఉత్సవంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో టూరిజం ఆర్డీ ఎన్ వి వి ఎస్ మూర్తి, జిల్లటూరిజం అధికారి పి వెంకటాచలం, జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్, ఆర్టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం వై ఎస్ ఎం మూర్తి, జిల్లా దేవాదాయ అధికారి ఈవి సుబ్బరావు, డిఆర్‌డిఎ పిడి బి.నగేష్, మెప్మా పిడి, ఇతర అధికారులు యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### అక్రమంగా మట్టి తరలిస్తున్న

# జెసిపి, నాలుగు లారీలు స్వాధీనం

#### అక్రమ తవ్వకాలపై మత్స్యశాఖ సొసైటీ సభ్యులు ఆగ్రహం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలోని మధురపూడి పంది గొయ్యి చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న జెసిపి, నాలుగు లారీలను రెవెన్యూశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మధురపూడి గ్రామానికి చెందిన పంది గొయ్యిలో అక్రమార్కులు అనుమతులు లేకుండా మట్టి తరలించడంపై మత్స్యశాఖ సొసైటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ, ఎన్డీఏ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు గణేశుల పోశయ్య మాట్లాడుతూ గత రెండేళ్లలో ఎన్డీఏ నాయకులు మండలంలో నిబంధనలకు విరుద్ధంగా యదేచ్ఛగా మట్టి మాఫియా సాగిస్తున్నార న్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్న తీరు, ప్రజల్లో పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. అదేవిధంగా పంది గొయ్యి చెరువును ఆక్రమణల నుండి విడిపించాలన్నారు. చెరువు విస్తీర్ణం సుమారు మూడు ఎకరాలు కాగా, సగానికి పైగా ఆక్రమణకు గురైందన్నారు. రెవెన్యూశాఖ అధికారులు సర్వే చేసి, మత్స్యశాఖ సొసైటీకి అప్పగించాలన్నారు. మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షులు దాసి వెంకన్న మాట్లాడుతూ మత్స్య శాఖకు సంబంధించిన చెరువును తమకు చెప్పకుండా అక్రమంగా మట్టిని తరలించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీఏ నాయకుల తీరును తీవ్రంగా తప్పుపట్టారు. రెవెన్యూశాఖకు ఫిర్యాదు చేయగా, రెవెన్యూ అధికారులు జెసిపి, నాలుగు లారీలను అదుపులోకి తీసుకుని తాసిల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సొసైటీ సభ్యులు బోలా ప్రసాద్, మోరంపూడి రమేష్, బోలా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### కోరం లేక మండల ప్రజా పరిషత్

# సర్వసభ్య సమావేశం వాయిదా : అశోక్ కుమార్



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కోరం లేక వాయిదా వేసినట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి బత్తిన అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు వుల్లి సూర్యకుమారి బుజ్జిబాబు ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరగవలసింది ఉంది. అయితే ఎంపీటీసీలు కాకపోవడంతో కోరం లేక, వేచి చూసి వాయిదా వేసినట్లు ఎంపీడీవో అశోక్ కుమార్ తెలిపారు. మరల సమావేశం ఎప్పుడు జరిగేది తెలియజేస్తామన్నారు.

# ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది

- రోజుకు 400 నుంచి 1800కు చేరిన జీజీహెచ్ ఓపీ
- రెండు నోటిఫికేషన్ల ద్వారా 99 మంది సిబ్బంది నియామకాలకు చర్యలు
- త్వరలో అదనంగా 200 పడకల ఏర్పాటు దిశగా ప్రణాళికలు
- సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్‌రే సేవల్లో గణనీయమైన మెరుగుదల
- ప్రజల సూచనలతో ఆసుపత్రి అభివృద్ధికి కూటమి ప్రభుత్వ కట్టుబాటు
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- రోగులతో నేరుగా మాట్లాడి సమస్యలపై ఆరా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మంగళవారం రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)ని సందర్శించిన ఆయన పలు విభాగాలను పరిశీలించి, రోగులు, వారి బంధువులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీజీహెచ్‌లో వైద్య సేవల నాణ్యత గణనీయంగా పెరిగిందన్నారు. గతంలో రోజుకు సుమారు 400 నుంచి 500 మంది మాత్రమే ఓపీ సేవలు పొందగా, ప్రస్తుతం ఆ సంఖ్య 1,800కు చేరుకోవడం ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో పెరిగిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన సేవల కారణంగా ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల కంటే ప్రభుత్వ వైద్య సేవలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో కూడా ఓపీ సంఖ్య మూడు నుంచి నాలుగు రెట్లు పెరిగిందన్నారు. ఆసుపత్రిలో ఉన్న ప్రత్యేక వైద్య విభాగాలను బలోపేతం చేయడం, అవసరమైన పరికరాలను సమకూర్చడం, సిఎస్ఆర్ నిధులు, ప్రభుత్వ సహకారంతో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం జరుగుతోందని వివరించారు. డాక్టర్లు, టెక్నీషియన్లు, పరిపాలనా సిబ్బంది కొరతను దశలవారీగా భర్తీ చేస్తూ వస్తున్నామని చెప్పారు. గతంలో ఆసుపత్రిలో అవసరమైన మానవ వనరుల్లో కేవలం 20 శాతం మాత్రమే అందుబాటులో ఉండగా, గత రెండేళ్లలో చేపట్టిన చర్యల వల్ల ఆ సంఖ్య 50 శాతానికి చేరుకుందని తెలిపారు. నాలుగైదు సంవత్సరాలుగా నిలిచిపోయిన నియామక ప్రక్రియలను పునరుద్ధరించి రెండు నోటిఫికేషన్లను విడుదల చేయించామని చెప్పారు. మొదటి నోటిఫికేషన్ ద్వారా 39 పోస్టులు, రెండో నోటిఫికేషన్ ద్వారా 60 పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో జనరల్ డ్యూటీ అటెండెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు, అనస్థీషియా టెక్నీషియన్లు, కార్డియాలజీ టెక్నీషియన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్లు, ఈసీజీ టెక్నీషియన్లు తదితర పోస్టులు ఉన్నాయని తెలిపారు. మొత్తం 99 మంది సిబ్బందిని ఒకటి నుంచి రెండు నెలల్లో నియమించే ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో నెలకు సుమారు 60 వేల మంది ఓపీ సేవలు పొందుతున్నారని, ఇన్‌పేషెంట్ సేవలపై కూడా ఒత్తిడి పెరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న 580 పడకలు సరిపోని పరిస్థితి నెలకొన్నందున, సిద్ధంగా ఉన్న క్రిటికల్ కేర్ బ్లాక్‌ను త్వరలో ప్రారంభించి అదనంగా సుమారు 200 పడకలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోందన్నారు. దీంతో ఆసుపత్రిలో రోగుల రద్దీ తగ్గడంతో పాటు పలు విభాగాలను విస్తరించే అవకాశం ఉంటుందని వివరించారు. గతంలో టెక్నీషియన్ల కొరత కారణంగా ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఎక్స్‌రే సేవల్లో ఇబ్బందులు ఉండేవని, ప్రస్తుతం ఆ సమస్యలను అధిగమించామని చెప్పారు. రూ.70 లక్షల వ్యయంతో అదనంగా ఒక ఎక్స్‌రే యంత్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల ఎక్స్‌రే నివేదికలు వేగంగా అందుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 30 ఎంఆర్ఐ స్కాన్లు, 40 సీటీ స్కాన్లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయని అంగీకరిస్తూనే, వాటిని దశలవారీగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ఉండేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సూచనను స్వీకరించే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, ప్రజల అభిప్రాయాల ఆధారంగానే అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి లేదా అవసరాన్ని బట్టి మరింత తరచుగా ఆసుపత్రిని సందర్శిస్తూ పరిస్థితులను సమీక్షిస్తున్నామని పేర్కొన్నారు. తాము చేసిన పనిని ప్రజలు అభినందిస్తే ఆనందిస్తాం... ఎక్కడ లోపాలు ఉన్నాయని చెబితే వాటిని సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తాం... ప్రజల మాట వినే ప్రజాస్వామ్య ప్రభుత్వం కూటమి ప్రభుత్వం" అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్, నాయకులు సలాది ఆనంద్, దాస్యం ప్రసాద్, కేబుల్ మురళి, ఆసుపత్రి కమిటీ సభ్యులు, ఆసుపత్రి అధికారులు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.


# రాష్ట్రాలు దాటిన రేషన్ మాఫియా

#### వృద్ధులకు ఇచ్చిన వెసులుబాటును ఆసరాగా మార్చుకున్న డీలర్లు
#### మమ్ముళ్ళ మత్తులో నిద్రవుతున్న అధికారులు
#### తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్లో విజిలెన్స్ కమిటీ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ తోట




**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డిపోలలో తీవ్ర అవకతవకలు ఏర్పడ్డాయని రేషన్ మాఫియా రాష్ట్రాలు దాటిందని పేదవారి ఆకలి కేకలు తీర్చేందుకు ఆహార భద్రతే లక్ష్యంగా అందించే పిడిఎస్ బియ్యాన్ని నేడు ఆదాయ వనరుగా రేషన్ డీలర్లు మార్చుకుంటున్నారని ముఖ్యంగా రేషన్ డీలర్‌ల వద్దకు వెళ్ళకుండానే రేషన్ బియాన్ని పక్కదారి పట్టిస్తున్నారని రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విమర్శలు చేశారు. పౌరసరఫర అధికారులు మమ్ముళ్ళ మత్తులో నిద్రవుతున్నారని ఆరోపించారు. ప్రతి ఎంఎస్‌ఒలు కనుసన్నలలో ఈ కోటా బియ్యం వ్యాపారం సాగుతుందని దుయ్యబట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొన్నారు. త్రిమూర్తులు మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లలో గర్భిణీలకు, పిల్లలకు ప్రతిరోజు ఇచ్చేటువంటి పౌష్టికాహార వివరాలను తెలిపే విధంగా మెను బోర్డు లను ఏర్పాటు చేయాలని కోరారు. రేషన్ డిపోలకు సంబంధించి సరఫరా వ్యవహారం పారదర్శకంగా జరగడంలేదన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ పర్యవేక్షణ చేయాలని కోరారు. 26వ తేది నుంచి 30 వరకు సీనియర్ సిటీజన్ల కోసం కొత్తగా తీసుకొచ్చిన రేషన్ పాలసీలో హైదరాబాదు, విజయవాడ , వైజాగ్ లాంటి సుదూర ప్రాంతాల్లో వృత్తిరీత్యా వెళ్ళిన లబ్ధిదారుల వద్దకు మిషన్లను తీసుకువెళ్లి కొత్త రేషన్ మాఫియా మెట్రిక్ వేలిముద్రలు వేయించి ఆ రేషన్ ని కూటమి నేతల సహకారంతో పక్కదారి పడుతున్నాయని తోట విమర్శించారు. రేషన్ షాపులు యందు అవకతవకలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారుల ఫిర్యాదు నెంబర్లు ప్రజల కొరకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం ఎన్ని రేషన్ కార్డులు ఇచ్చారో పూర్తి వివరాలు తెలపాలని అధికారులను కోరారు. అనంతరం సమావేశంలో పొందుపరిచిన అంశాలపై చర్చించారు.

# బాల్యవివాహాలను అవగాహనతో అరికడదాం : రాణి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బాల్య వివాహాలను అవగాహనతోనే అరికట్టడం సాధ్యమవుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆర్. బేబీ రాణి అన్నారు. స్థానిక 41 వ వార్డులోని కోటిలింగాల పేట 1, 2 అంగన్వాడీ సెంటర్లో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన బేబీ రాణి మాట్లాడుతూ కిశోర బాలబాలికల సాధికారత అందరి బాధ్యతని అన్నారు. అందరూ కలిసి బాల్య వివాహ రహిత ప్రాంతానికి కృషి చేయాలని ఆమె కోరారు. కిశోర బాల బాలికల తల్లిదండ్రులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్కె దీపిక, అంగన్వాడీ టీచర్లు కెవి రత్నం, టి. సుగుణ, హెల్పర్లు వి.దుర్గ, జి. వీరమణి, కిషోరి బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సమర్ధవంతంగా న్యాయ సేవలు అందించాలి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం 8వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (టెన్యూర్)గా న్యాయవాది తుమ్మల వాసులక్ష్మిని ప్రభుత్వం నియమించింది. నియామక ఉత్తర్వులు అందుకున్న తుమ్మల వాసులక్ష్మి మంగళవారం తిలక్ రోడ్డులోని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి న్యాయవాదిగా ఉన్న అనుభవం, సేవాభావంతో ప్రభుత్వ తరఫున సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించాలని ఆకాంక్షించారు. న్యాయ వ్యవస్థలో మహిళలకు అవకాశాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వాసులక్ష్మి నియామకం యువ మహిళా న్యాయవాదులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ తరఫున కోర్టులో సమర్ధవంతమైన వాదనలు వినిపిస్తూ న్యాయ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని వాసులక్ష్మి ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో పీపీ రాచపల్లి ప్రసాద్, అదనపు పీపీలు నామా సత్యనారాయణ, కనకలింగేశ్వరరావు, గౌతమి జీవ కారుణ్య సంఘం చైర్మన్ వర్రే శ్రీనివాసరావు, పలువురు న్యాయవాదులు, పార్టీ నాయకులు పాల్గొని వాసులక్ష్మికి అభినందనలు తెలిపారు.




## అందంలో అప్సరస.. సాలిడ్ హిట్ కోసం

# చాలా కాలంగా ఎదురుచూస్తున్న భామ




కొంతమంది హీరోయిన్స్ సాలిడ్ హిట్ కోసం చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ సరైన హిట్స్ లేక సతమతం అవుతున్నారు వారిలో ఈ అమ్మడు ఒకరు. ఈ ముద్దుగుమ్మ అందంలో అప్సరస, నటన పరంగానూ మంచి మార్కులు కొట్టేసింది.. కానీ ఆశించిన స్థాయిలో అవకాశాలు మాత్రం అందుకోలేకపోతుంది. కొంతమంది హీరోయిన్స్ సాలిడ్ హిట్ కోసం చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ సరైన హిట్స్ లేక సతమతం అవుతున్నారు వారిలో ఈ అమ్మడు ఒకరు. ఈ ముద్దుగుమ్మ అందంలో అప్సరస, నటన పరంగానూ మంచి మార్కులు కొట్టేసింది.. కానీ ఆశించిన స్థాయిలో అవకాశాలు మాత్రం అందుకోలేకపోతుంది. దాంతో ఆమె అభిమానులు ఒకింత నిరాశ వ్యక్తం చేస్తున్నారు. తెలుగు అమ్మాయిలకు ఇటీవల సినిమాల్లో మంచి అవకాశాలు దక్కుతున్నాయి. కొందరు స్టార్స్ గానూ మారి సినిమాలు చేస్తూ మెప్పిస్తున్నారు. మరికొంతమంది తమను తాము నిరూపించుకుంటూ దూసుకుపోతున్నారు. ఇక ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న హీరోయిన్ కూడా ఒకొక్క సినిమాకు వేరియేషన్స్ చూపిస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటుంది. ఆమె ఎవరో కాదు అందాల భామ అనన్య నాగళ్ల. అనన్య నాగళ్ల మల్లేశం అనే సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది. ప్రియదర్శి హీరోగా నటించిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. దాంతో ఈ చిన్నదానికి మంచి గుర్తింపు వచ్చింది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసి మెప్పించింది. కెరీర్ బిగినింగ్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసిన ఈ చిన్నది నటనపై మక్కువతో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు హీరోయిన్‌గా కంటిన్యూ అవుతుంది. మల్లేశం తర్వాత ప్లే బ్యాక్ అనే సినిమా చేసింది. ఆతర్వాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన వకీల్ సాబ్ లో ఛాన్స్ అందుకుంది. ఈ సినిమాలో తన నటనతో కట్టిపడేసింది అనన్య నాగళ్ల. ఆతర్వాత వరుసగా 9 సినిమాలు చేసింది.

కానీ ఆ సినిమాలు పెద్దగా బాక్సాఫీస్ దగ్గర ప్రభావం చూపలేదు. దాంతో ఈ అమ్మడి ఫ్యాన్స్ కాస్త నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అందం అభినయం ఉన్న అనన్యకు బడా హీరోల సినిమాల్లో ఛాన్స్‌లు రావాలని కోరుకుంటున్నారు. ఇక అనన్య పేరు ఇటీవల వార్తల్లో ఎక్కువగా వినిపించింది.. ఆమధ్య బెట్టింగ్ యాప్ ఇష్యులో .. అలాగే మొన్నామధ్య ఇన్ స్టా సబ్ స్క్రిప్షన్ వార్తల్లో అనన్య పేరు వినిపించింది. కాగా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలోనే ఈ చిన్నదాని ఫోటోలు చక్కర్లు కొడుతున్నాయి.

## 94 ఏళ్ల ప్రయోగశాల.. పాటే ప్రాణంగా వస్తున్న

# సింగీతం శ్రీనివాసరావు 'సింగ్ గీతం'..!





టాలీవుడ్డే కాదు భాం తీయ సినిమా ఇండస్ట్రీ గర్వంగా చెప్పుకునే డైరెక్టర్ల లో సింగీతం శ్రీనివాసరావు ఒకరు. సినిమాల్లో ఈయన చేసిన ప్రయోగాలు మరే డైరెక్టర్ చేసి ఉండరేమో. .. 'ఆదిత్య 369', 'పుష్పక విమానం', 'మయూరి' , 'భైరవ ద్వీపం' వంటి ఎన్నో కల్ట్ క్లాసిక్ సినిమాలు తెరకెక్కించారు సింగీతం శ్రీనివాసరావు. 'పాతికేళ్లకే పాతబడిపోతే ఎట్టా.. ఏదైనా ఈ భూమ్మీద ఉన్నపుడే చేసేయాలి.. మళ్లీ పుడతామా ఏంటి?'.. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాలో చెప్పిన ఈ పవర్ ఫుల్ డైలాగ్ ఇప్పుడు ఒక లెజెండరీ దర్శకుడికి అక్షరాలా అతికినట్లు సరిపోయింది. ఆ పెద్ద మనిషి మరెవరో కాదు.. తొమ్మిదిన్నర దశాబ్దాల వయసులోనూ పసిబాలుడి ఉత్సాహంతో, సినిమానే శ్వాసగా బతుకుతున్న దర్శక దిగ్గజం సింగీతం శ్రీనివాసరావు. వయసు అనేది కేవలం శరీరానికే కానీ, సృజనాత్మకతకు, కలలకు కాదని ఆయన తన ప్రతి అడుగులోనూ నిరూపిస్తూనే ఉన్నారు. ముప్పై ఏళ్లకే మోకాళ్ల నొప్పులు, నలభై ఏళ్లకే నడుము నొప్పులు అంటూ నేటి తరం యువత శారీరకంగా, మానసికంగా త్వరగా అలసిపోతున్న ఈ రోజుల్లో.. 94 ఏళ్ల వయసులో కూడా ఆయనలో ఏమాత్రం శక్తి తగ్గలేదు. పైగా ఈ తరం జెన్-జీ ప్రేక్షకుల నాడి పట్టుకుని.. వాళ్లను సైతం ఆశ్చర్యపరిచేలా సరికొత్త కాన్సెప్ట్‌తో ఆయన మన ముందుకు వస్తున్నారు. ఈ వయసులోనూ ఆయన 24 ఏళ్ల కుర్రాడిలా ఉత్సాహంగా, వినూత్నంగా ఆలోచిస్తున్న తీరు చూసి ఇండియన్ సినిమా ఇండస్ట్రీ సైతం సలామ్ చేస్తోంది. తెలుగు సినిమా చరిత్రలోనే కాదు.. యావత్ ఇండియన్ సినిమా రంగానికి సింగీతం శ్రీనివాసరావు ఒక సజీవ నిఘంటువు. ఆయన తీసిన ప్రతి సినిమా ఒక పాఠం.. ఆయన సృష్టించిన ప్రతి కథా ఒక ప్రయోగశాల. 'భైరవ ద్వీపం'తో జానపదాల్లో మాయాజాలాన్ని చూపించినా, 'ఆదిత్య 369'లో టైమ్ మెషీన్ తో కాలాన్ని పరుగులు పెట్టించినా, 'అపూర్వ సహోదరులు'తో కమల్ హాసన్ చేత మరుగుజ్జు పాత్ర చేయించి మెప్పించినా, 'బృందావనం'తో స్వచ్ఛమైన హాస్యాన్ని పంచినా.. అది ఒక్క సింగీతంకే చెల్లింది. ట్రెండ్ ఫాలో అవ్వడం కాకుండా, ట్రెండ్ సెట్ చేయడం ఆయన శైలి. సినిమా అంటే ఎవరైనా తీస్తారు.. కానీ ఎన్ని తరాలు మారినా ఎప్పటికీ నిలిచిపోయే 'టైమ్ లెస్ క్లాసిక్స్' తీయడం కేవలం ఆయనకే సాధ్యమైంది. ఎప్పుడూ ఏదో ఒక కొత్తదనం కోసం తపించే సింగీతం.. ఇప్పుడు తన సుదీర్ఘ కెరీర్‌లోనే అత్యంత సాహసోపేతమైన ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ఆ సినిమా పేరే 'సింగ్ గీతం'. ఈ సినిమా కాన్సెప్ట్ వింటే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే ఈ సినిమాలో అసలు మాటలే ఉండవు. సినిమా మొత్తం కేవలం పాటలతోనే ఆడియన్స్ ముందుకు రాబోతోంది. సంభాషణలు లేకుండా, ఒక కథను కేవలం పాటలతో, సంగీతంతోనే ప్రేక్షకులకు అర్థమయ్యేలా చెప్పడం ఒక గొప్ప కళ. 2.17 గంటల సినిమాని కేవలం పాటలతోనే నడిపించడం అంటే వేరే ఏ దర్శకుడికైనా కత్తిమీద సామే. ఇది వర్కవుట్ అవుతుందా? అని సందేహాలు కూడా రావచ్చు. కానీ మెగాఫోన్ పట్టింది సింగీతం కాబట్టి.. ఆ సందేహాలకు తావు లేదు. ఎందుకంటే మూడున్నర దశాబ్దాల క్రితమే మాటలు లేకుండా 'పుష్పక విమానం' లాంటి అద్భుతమైన మూకీ చిత్రాన్ని తీసి.. కేవలం మౌనంతోనే అన్ని ఎమోషన్స్ పండించిన గొప్ప ఘనత సింగీతం సొంతం.

# కెప్టెన్సీ ముళ్ల కిరీటమేనా?..

### భారత జట్టుకు కెప్టెన్‌గా ఎంపికవ్వగానే అయ్యర్ అట్టర్ ఫ్లాప్




టీమిండియా కొత్త టీ20 కెప్టెన్‌గా ఎంపికైన శ్రేయస్ అయ్యర్ ముంబై టీ20 లీగ్‌లో వరుసగా విఫలమవుతున్నాడు. సోబో ముంబై ఫాల్కన్స్ తరఫున నిరాశాజనక ప్రదర్శన చేసిన అయ్యర్ ఫామ్‌పై ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. భారత క్రికెట్ జట్టుకు కొత్త టీ20ఐ కెప్టెన్‌గా ఎంపికైన స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు ఊహించని షాక్ తగిలింది. కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన కేవలం మూడు రోజుల వ్యవధిలోనే ఆయన ఫామ్ ఒక్కసారిగా పడిపోయింది. ప్రస్తుతం జరుగుతున్న ముంబై టీ20 లీగ్‌లో శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల కోసం బీసీసీఐ ఇతనికి జట్టు కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే లీగ్‌లో జరిగిన తాజా మ్యాచ్‌లో అయ్యర్ కనీస ప్రభావం కూడా చూపలేకపోవడంతో విమర్శలు మొదలయ్యాయి.

**సూర్యకుమార్ యాదవ్ స్థానంలో ఎంపిక**

శ్రేయస్ అయ్యర్ కెరీర్‌లో అత్యంత కీలకమైన మైలురాయిని అందుకున్న వెంటనే ఈ ఫామ్ మిస్సవ్వడం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జూన్ 6వ తేదీన చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్.. సూర్యకుమార్ యాదవ్ స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను భారత కొత్త టీ20 కెప్టెన్‌గా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు. టీ20 వరల్డ్ కప్ 2026 ప్రచారం ముగిసిన తర్వాత సెలెక్షన్ కమిటీలో జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఈ కీలక మార్పు జరిగింది. అయితే, సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా అయ్యర్ ముంబై లీగ్‌లో ఆడలేకపోతున్నాడు.

**సోబో ముంబై ఫాల్కన్స్ తరఫున నిరాశాజనక ప్రదర్శన**

ఈ లీగ్‌లో సోబో ముంబై ఫాల్కన్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రేయస్ అయ్యర్, ఇప్పటివరకు ఆడిన మూడు ఇన్నింగ్స్‌లలో కేవలం 15.00 సగటుతో, 109.76 స్ట్రైక్ రేట్‌తో కేవలం 45 పరుగులు మాత్రమే చేయగలిగాడు. జూన్ 9వ తేదీ మంగళవారం వాంఖడే స్టేడియంలో ఆకాశ్ టైగర్స్ ఎండబ్ల్యూఎస్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అయ్యర్ 10 బంతుల్లో కేవలం 10 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. ఈ మ్యాచ్‌లో అతని జట్టు 66 పరుగుల భారీ తేడాతో ఓటమిని చవిచూసింది. ఇన్నింగ్స్ అంతటా శ్రేయస్ అసలు లయలో ఉన్నట్లు కనిపించలేదు.

**చేతులెత్తేసిన ముంబై ఫాల్కన్స్ బ్యాటర్లు**

వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఆకాశ్ టైగర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 227/6 పరుగుల భారీ స్కోరు సాధించింది. జై బిస్తా 27 బంతుల్లో 57 రన్స్ చేయగా, అజిత్ యాదవ్ 35 బంతుల్లో 68 రన్స్‌తో రెచ్చిపోయాడు. సర్ఫరాజ్ ఖాన్ కేవలం 10 బంతుల్లోనే 31 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు మంచి ఊపునిచ్చాడు. అనంతరం 228 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సోబో ముంబై ఫాల్కన్స్ క్రమంగా వికెట్లు కోల్పోతూ పేకమేడలా కూలిపోయింది. ఇషాన్ ముల్‌చందాని 40 పరుగులతో వేగంగా ఇన్నింగ్స్ ప్రారంభించినప్పటికీ, అతను అవుటయ్యాక జట్టు తలవంచేసింది. మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా చేతులెత్తేయడంతో ఫాల్కన్స్ జట్టు 17.5 ఓవర్లలో 161 పరుగులకే ఆలౌట్ అయింది.

**ఐపీఎల్ రికార్డులు చూసే కెప్టెన్సీ**

శ్రేయస్ అయ్యర్ ఫామ్ పై ఇంతలా చర్చ జరగడానికి కారణం.. అతను ఐపీఎల్‌లో చూపించిన అద్భుతమైన కెప్టెన్సీ రికార్డే. 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టిన అయ్యర్, ఆ తర్వాత 2025లో పంజాబ్ కింగ్స్ జట్టును ఐపీఎల్ ఫైనల్‌కు చేర్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆయన 175.07 స్ట్రైక్ రేట్‌తో 604 రన్స్ చేయగా, ఇటీవలే ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ తరఫున 168.81 స్ట్రైక్ రేట్‌తో 498 పరుగులు సాధించాడు. ఈ అద్భుతమైన ప్రదర్శనల వల్లే సెలెక్టర్లు అతడిని టీమిండియా తదుపరి తరం లీడర్‌గా ఎంపిక చేశారు. అజిత్ అగార్కర్ కూడా అయ్యర్ రికార్డులను ప్రశంసిస్తూనే అతనికి కెప్టెన్సీ కట్టబెట్టారు. మరి ఈ తాత్కాలిక ఫ్లాప్ షో నుంచి శ్రేయస్ ఎలా పుంజుకుంటాడో చూడాలి.

# ఫిఫా చరిత్రలో ఎన్నడూ లేని వివాదం..

### ఇరాన్ టీమ్‌కు నరకం చూపిస్తున్న అమెరికా అడ్మినిస్ట్రేషన్




ఫిఫా వరల్డ్ కప్ 2026లో ఇరాన్ అభిమానుల టికెట్లను అమెరికా రద్దు చేయడంతో భారీ వివాదం చెలరేగింది. ఫిఫా నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలు వచ్చాయి. ఇరాన్ జట్టు మద్దతు లేకుండానే మ్యాచ్‌లు ఆడే పరిస్థితి ఏర్పడింది. అంతర్జాతీయంగా ఈ అంశం తీవ్ర చర్చనీయాంశమైంది. ఫిఫా వరల్డ్ కప్ 2026 23వ ఎడిషన్ ప్రారంభానికి కేవలం మరో రెండు రోజులు మాత్రమే సమయం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ అభిమానులు ఈ మెగా ఈవెంట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే టోర్నమెంట్ కిక్‌ఆఫ్‌కు ముందే ఒక పెద్ద అంతర్జాతీయ వివాదం తెరపైకి వచ్చింది. తమ దేశానికి చెందిన ఫుట్‌బాల్ అభిమానుల మ్యాచ్ టికెట్లను ఆతిథ్య దేశమైన అమెరికా రద్దు చేసిందని ఇరాన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ తీవ్రమైన ఆరోపణలు చేసింది. ఈసారి ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌ను అమెరికా సహా మూడు దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

**రాజకీయ కక్ష సాధింపు చర్యలా?**

ఇరాన్, మెరికా దేశాల మధ్య ఉన్న పాత రాజకీయ వివాదాల కారణం గానే అమెరికా కావాలని ఇరాన్ ప్రేక్షకులను స్టేడియాల్లోకి రాకుండా అడ్డుకుంటోందని ఇరాన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆరోపించింది. ఈ వ్యవహారంపై మంగళవారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేస్తూ, "వరల్డ్ కప్ ప్రారంభానికి సరిగ్గా రెండు రోజుల ముందు అమెరికా తన కుట్ర బుద్ధిని చాటుకుంది. గ్రూప్ స్టేజ్ లో ఇరాన్ ఆడబోయే మూడు మ్యాచ్‌ల వేదికల వద్దకు మా దేశ సపోర్టర్లు రాకుండా తీవ్రమైన ఆటంకాలు సృష్టిస్తోంది" అని ఇరాన్ ఫెడరేషన్ మండిపడింది.

**విమానాశ్రయంలో ఆటగాడి నిర్బంధం**

అమెరికా కేవలం ఇరాన్ ప్రేక్షకులను మాత్రమే కాకుండా ఇతర దేశాల ఆటగాళ్లను కూడా ఇబ్బంది పెడుతోందని నివేదికలు చెప్తున్నాయి. కొద్దిరోజుల క్రితమే ఇరాక్ ఫుట్‌బాల్ జట్టుకు చెందిన ఒక ముఖ్యమైన ఆటగాడిని అమెరికా ఎయిర్‌పోర్టులో అక్కడి భద్రతా సిబ్బంది అకారణంగా డిటైన్ చేశారు. దాదాపు 7 గంటల పాటు సుదీర్ఘంగా విచారించిన తర్వాతే అతడిని దేశంలోకి అనుమతించారు. దీనికి తోడు, ఇరాన్ ఫుట్‌బాల్ జట్టుకు సహాయకారిగా ఉండాల్సిన కొందరు కీలక సపోర్ట్ స్టాఫ్ సభ్యులకు కూడా వీసాలు ఇచ్చేందుకు అమెరికా నిరాకరించిందని, కావాలనే పరిపాలనాపరమైన అడ్డంకులు సృష్టిస్తోందని ఇరాన్ ఆవేదన వ్యక్తం చేసింది.

**ఫిఫా నిబంధనల ఉల్లంఘన**

అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య నిబంధనల ప్రకారం.. వరల్డ్ కప్‌లో జరిగే ప్రతి మ్యాచ్‌కు సంబంధించిన మొత్తం టికెట్లలో 8 శాతం కోటాను ఆయా మ్యాచ్‌లు ఆడే దేశాల ఫెడరేషన్లకు కేటాయించాలి. ఆయా దేశాల బోర్డులు ఈ టికెట్లను తమ దేశంలోని అభిమానులకు విక్రయించుకుంటాయి. ఇరాన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ కూడా ఫిఫా నిబంధనల ప్రకారమే అమెరికాలో జరగబోయే తమ గ్రూప్ మ్యాచ్‌ల టికెట్ల విక్రయాలను అధికారికంగా ప్రారంభించింది. అయితే అమెరికా ప్రభుత్వం జోక్యం చేసుకుని ఇరాన్‌కు దక్కాల్సిన ఆ 8 శాతం టికెట్ల కోటాను అకస్మాత్తుగా వెనక్కి తీసుకుంది.

**మద్దతు లేకుండానే బరిలోకి ఇరాన్ జట్టు**

అమెరికా తీసుకున్న ఈ ఆకస్మిక నిర్ణయం వల్ల ప్రస్తుతం ఇరాన్ ఫుట్‌బాల్ బోర్డు తమ దేశ అభిమానులకు ఒక్క టికెట్ కూడా కేటాయించలేని నిస్సహాయ స్థితిలో పడిపోయింది. దీంతో స్టేడియంలో తమ దేశ జెండాలతో మద్దతు తెలిపే ప్రేక్షకులు లేకుండానే ఇరాన్ జట్టు ఆడాల్సి వచ్చేలా ఉంది. కాగా, ఈసారి వరల్డ్ కప్‌లో ఇరాన్ జట్టు గ్రూప్ జిలో స్థానం సంపాదించింది. ఈ గ్రూప్‌లో ఇరాన్ తన తదుపరి మ్యాచ్‌ల్లో బలమైన బెల్జియం, ఈజిప్ట్, న్యూజిలాండ్ జట్లతో తలపడాల్సి ఉంది. మరి ఈ టికెట్ల వివాదంపై ఫిఫా ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com